పడగ విప్పిన తాచుపాము

బొమ్మిడి అచ్చారావు

ఆ దృశ్యం చూడలేక కళ్ళు మూసుకున్నాడు డిటెక్టివ్ కిరణ్. హంతకుడు నరరూప రాక్షసుడో ఆటవిక జాతికి చెందిన అనాగరికుడో అయ్యుంటాడు. అంత ఘోరమైన హత్య కిరణ్ యిదివరకు చూడలేదు.

మొత్తం శరీర భాగాలన్నీ మెడికల్ స్టూడెంట్సు డిసెక్టు చేసినట్టు ప్రతిభాగాన్ని ఖండించాడు హంతకుడు. చేతులు, కాళ్ళు, కళ్ళు, ముక్కు, చెవులులాంటి పై భాగాలే కాకుండా శరీరాంతర్భాగంలోని గుండె, కాలేయం, మెదడువంటి భాగాలు కూడా విడివిడిగా పార్సిల్ చేశాడు.

"ఎవరిదీ శవం?" అడిగాడు కిరణ్ దృష్టి మరల్చుకుని.

"పోలికలు కూడా తెలీకుండా ముక్కలు ముక్కలు చేసి పంపాడు కదా! గుర్తుపట్టడం కష్టమే! కాని, కొన్ని ఆధారాల్ని బట్టి చూచాయగా గుర్తుపట్టేరు మావాళ్ళు?" అని ఆగాడు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్.

"ఏమిటా ఆధారాలు?"

"ఇదిగో, యీ చీటీలో నాలుగు వాక్యాలు రాయబడి వున్నాయి, చూశావా? దీన్ని బట్టి ఏదో రహస్య ముఠాని పట్టుకోవటానికి వారంరోజుల క్రితం బొంబాయి వెళ్ళిన సి.బి.ఐ. ఏజెంటు దివాకర్‌ది కావచ్చునని ఊహిస్తున్నారు."

కిరణ్ చీటీ అందుకుని చదివాడు.

"మా కర్యకలాపాల్లో తల దూర్చాలని ప్రయత్నించినా, భంగపరచాలని ప్రయత్నించినా వీడికి పట్టిన దుర్గతే మీ డిపార్టుమెంటులోని ప్రతి ఒక వ్యక్తికీ పడుతుంది. బీ కేర్‌ఫుల్. మమ్మల్ని పట్టుకోవాలని ప్రయత్నించవద్దు. ఇది మీ అందరికీ హెచ్చరిక!" అని వుందా చీటీలో.

"దివాకర్ ఎప్పుడు వెళ్ళాడు?" ఆ ముఠా వివరాలేమిటి? ఈ పార్సెల్ ఎప్పుడొచ్చింది? ఎవరు తెచ్చారు దీన్ని?" ప్రశ్నల వర్షం కురిపించాడు కిరణ్.

"ఇది సరాసరి మన క్రైంబ్రాంచ్ ముందు గతరాత్రి గురు తెలీని మనుషులు వేన్‌లోనించి కిందికి తోసేసి వెళ్ళిపోయారు. చెక్కపెట్టెలో జాగ్రత్తగా పాక్ చేసి పడేశారు. డ్యూటీ సెంట్రీ చూశాడు. పైన సిటీ క్రైం బ్రాంచ్ పేరుంది. వెంటనే కమిషనర్‌కి, డి.జి.పి.కి, ఎస్పీకి మెసేజెస్ వెళ్ళాయి. అందరి సమక్షంలోను దీన్ని పగలకొట్టారు. లోపల ఈ ఖండాలతోబాటు చీటీ దొరికింది.

"అప్పటికి వారంరోజుల క్రితం దివాకర్ బొంబాయి వెళ్ళాడు—ఓ స్మగులింగ్ ముఠా ఆచూకీ తెలుసుకోవటానికని! దేశంలోని ఓడరేవులన్నిటిద్వారా స్నేక్ లెదర్

యింకా కొన్ని ప్రొహిబిటెడ్ గూడ్సు అక్రమ రవాణా అవుతున్నాయి విదేశాలకు. వాటిలో యీ ముఠా అగ్రస్థానం వహిస్తోంది. దాని ఆచూకీ తెల్సుకోవటం కోసం దివాకర్ వెళ్ళాడు. మొదటి రెండు రోజులు—అతన్నుంచి ఇన్వెస్టిగేషన్ బ్యూరోకి మెసేజెస్ వచ్చాయట. తర్వాత అకస్మాత్తుగా కాంటాక్టు బ్రేకయిపోయాయి. ఇంతలో యీ పార్సిల్ వచ్చి పెద్ద దుమారం లేపింది" చెప్పాడు శ్రీనివాస్.

"అయితే, హతులెవరైనదీ కన్ఫర్మ్ అయినట్టే!"

"ఇంకా పూర్తిగా నిర్ధారణ కాలేదు. దివాకర్ వీపుకి కుడిపక్కన, ఎడమచేయి మణికట్టువద్ద ఐడెంటిఫికేషన్ మార్క్సు వుండాలి. కాని సరిగ్గా ఆ ప్రదేశాల్లో చర్మం చీరెయ్యబడింది. మార్క్సు దొరకలేదు. ముఖం అసలే గుర్తు తెలీకుండా కళ్ళు చెవులు ముక్కు కోసేశారు. అతను వేసుకువెళ్ళిన దుస్తులు అసలు శవఖండాలతో పాటు లేనేలేవు! దంతనిర్మాణం, తల వెంట్రుకలనుబట్టి నిర్ధారణ చేయటానికి నిపుణులు ప్రయత్నిస్తున్నారు. ఇంకా పరిశోధన సాగుతోంది."

"దివాకర్ వివరాలేమిటి?"

"అతను బ్రహ్మచారి. వయసు ముప్ఫయి దాటింది. అతనికో గర్ల్ ఫ్రెండ్ వుంది. పేరు శకుంతల. ఈ సీజన్లో పెళ్ళిచేసుకోవటానికి నిర్ణయించుకున్నారు. అతనికి తల్లి, ఓ తమ్ముడు వున్నారు. ముగ్గురు యిక్కడే డిపార్టుమెంటల్ క్వార్టర్సులో వుంటున్నారు."

"శకుంతల ఏం చేస్తుంటుంది? ఆమె వుండేది ఎక్కడ?"

"ఆమె టెలిఫోన్స్‌లో పనిచేస్తోంది. పి అండ్ టి కాలనీలో క్వార్టర్సులోనే వుంటోంది. ఒంటరిది. వెనక ముందు ఎవరూ లేరని వినికిడి."

"దివాకర్‌కి ఆమెకి పరిచయమేలా జరిగింది? వాళ్ళిద్దరు విచ్చలవిడిగా తిరుగుతుండేవాళ్ళా? దివాకర్ గురించిన పర్సనల్ విషయాలు ఆమెకి బాగా తెలిసే వుండాలి..!"

"తెలిసుండొచ్చు. నేను వివరాలు సేకరించలేదు. ఎందుకంటే శవం దివాకర్‌దని యింతదాకా నిర్ధారణే జరగలేదుకదా! అందుకే దివాకర్ తల్లికి తమ్ముడికిగాని, శకుంతలకిగాని విషయం యింతదాకా తెలియపర్చలేదు."

"దట్స్ గుడ్! నిపుణుల పరీక్ష పూర్తయ్యాక మన పరిశోధన ఏ కోణంలో మొదలుపెట్టాలో నిర్ణయించుకుందాం" అంటూ లేచాడు కిరణ్.

ఇంతలో ఫోన్ మోగింది. శ్రీనివాస్ అందుకున్నాడు అవతలివైపు నుంచి. మెసేజ్ వింటూనే కుర్చీలోంచి హడావిడిగా లేచాడు శ్రీనివాస్.

"ఇప్పుడే బయల్దేరి వస్తున్నాను" అంటూ ఫోన్ పెట్టేసి హేట్ తగిలించుకున్నాడు శ్రీనివాస్. "పి అండ్ టి కాలనీలో ఎవరో కిరసనాయిలు మీద పోసుకుని తగలబెట్టుకున్నారట. మంటలు బయటకు వ్యాపించటంతో ఫైర్ సర్వీస్‌కి ఫోన్ చేసి యిటు మనకూ ఫోన్ చేశారు కాలనీవాళ్ళెవరో!" అన్నాడు.

"శకుంతల కాదుగదా!" అన్నాడు కిరణ్.

దెబ్బతిన్నట్టు చూశాడు శ్రీనివాస్. "తొందరలో వివరాలడగనేలేదు. ఆడో మగో కూడా తెలీదు. ఎనీవే, వెళ్తున్నాంకదా! అన్నీ తెలుస్తాయి. శకుంతల కాదని, కాకూడదనీ కోరుకుంటున్నాను. మన కేస్‌కి మూలా

ధారం ఆమే ప్రస్తుతం!" అంటూ హడావిడిగా స్టాఫ్‌కి ఆదేశాలిచ్చాడు శ్రీనివాస్.

"కమాన్ బ్రదర్! నీ టయోటా వదిలెయ్యి, జీప్‌లో పోదాం" అన్నాడు శ్రీనివాస్.

2

పదిహేను నిమిషాల్లో శ్రీనివాస్ బలగం ఎక్కిన జీపు పి అండ్ టి కాలనీ క్వార్టర్సు చేరుకుంది.

అప్పటికి ఫైర్ యింజన్‌లు మంటలనార్పేశాయి. ప్రమాదం జరిగింది మూడో అంతస్తులోన.

కిరణ్ శ్రీనివాస్ మూడో అంతస్తులోని బర్నింగ్ కేసున్న క్వార్టరుకి చేరారు. అక్కడ జనం బాగా గుమి కూడివున్నారు. కిటికీనుంచి పొగలు యింకా వస్తూనే వున్నాయి. తలుపులు, కిటికీ తలుపులు నల్లగా కాలి పోయాయి.

శ్రీనివాస్ ఆదేశానుసారం కాన్‌స్టేబుల్స్ తలుపులు పగలకొట్టారు. వెంటనే పూడివచ్చేశాయి.

లోపల పూర్తిగా కాలిపోయిన శవం! ఒళ్ళు కాలిన వాసన ముక్కుపుటాల నదరగొట్టుతోంది. మాంసం కూడా బాగా కాలి వుడికిపోయింది. దాదాపు పూర్తిగా తగలబెట్టిన శవంలా వుంది.

వరసగా దారుణంగా చచ్చిన శవాల్ని రెండు చూడటంతో కిరణ్ కడుపులో తిప్పింది.

పక్క పోర్షన్ అతను చెపుతున్నాడు.

"ఓ అరగంట క్రితం ఏదో వాసన వస్తూనట్టు పని గట్టిందట సార్ మా ఆవిడ. అందరం ఆఫీసులకి వెళ్ళి పోయాం. ఆడవాళ్ళు కూడా చాలామంది ఉద్యోగస్తులే

కావటంతో యిళ్ళ దగ్గర వుండేవాళ్ళు అరుదు. వాసన వెనక నే మంటలు హెచ్చుగా కనిపించాయట కిటికీలో నుంచి. వెంటనే మా ఆవిడ నలుగుర్ని కేకలు పెట్టి పిలిచింది. ఈ ఒక్క పోర్షన్ తో బాటు తక్కిన క్వార్టర్సుకి కూడా మంటలు వ్యాపించటంతో భయపడి అందర్నీ ఫోన్ మీద పిలిపించారు అందరు ఆడవాళ్ళు కలిసి. తర్వాత ఫైర్ సర్వీస్ కి, మీకు కబురు చేశాం."

"అది సరే, అసలు యీ శవం ఎవరు?"

"శకుంతల అని, ఆపరేటర్ సార్! టెలిఫోన్ లో."

కిరణ్ సాలోచనగా చూశాడు శ్రీనివాస్ వంక. శ్రీనివాస్ యిబ్బందిగా చూశాడు.

"కిరసనాయిలు పోసుకుని తగల బెట్టుకుందని ఎలా అనుకున్నారు?" అడిగాడు కిరణ్.

"సాధారణంగా బర్నింగ్ కేసులన్నీ ఇదే తంతులో నడుస్తాయికదా సార్! అందుకని అలా వూహించాం."

"ఆమె ప్రమాదవశాత్తూ తగలబడి వుండొచ్చు కదా!" అన్నాడు శ్రీనివాస్.

పక్కింటాయనకి కొంచెం కోపం వచ్చినట్టుంది?

"అవన్నీ చూసుకోవలసింది మీరు! మా సివిల్ డ్యూటీ మేం చేశాం. నయం, సమయానికి ఫైర్ సర్వీస్ రాకుంటే బిల్డింగంతా నేలమట్టమై పోయుండేది. మంటల్లో కాలి" అన్నాడతను.

శ్రీనివాస్ కి అతను తమ డిపార్టుమెంటు అసమర్థతని ఎత్తిపొడుస్తున్నట్టనిపించింది.

"ఆల్ రైట్! అది మేం ఇన్వెస్టిగేట్ చేస్తాం. శకుంతలని చివరిసారిగా యెవరు చూశారు? ఆమె ఆఫీసు అవర్సులో క్వార్టర్లో ఎందుకుంది? మీకెవరికైనా తెలిస్తే

చెప్పండి!" అన్నాడు కిరణ్.

"ఆమె కీరోజు వీక్లీ ఆఫ్ సార్! అంచేత యింట్లోనే వుంది. ఉదయంనించీ ఆమె ఇంట్లో వుండగా అందరమూ చూశాం" అన్నాడు యిందాకటి ఆయనే.

"థాంక్యూ! ఆమెకోసం ఉదయంనించీ యెవరైనా వచ్చారేమో చెప్పగలరా?"

"మా ఆవిడనడిగి చెపుతానుండండి" అని పక్కనే వున్న భార్యని కనుక్కొని "లేదు సార్, యెవరూ రాలేదుట!" అన్నాడాయన.

"థాంక్యూ ఒన్స్ ఎగెయిన్" అని కిరణ్ శ్రీనివాస్ వంక చూసి, "పద, లోపల పరిశీలిద్దాం" అన్నాడు.

గదంతా కాలిపోయింది. పక్క గుడ్డలు, పరుపు, ఛెయిర్స్, టేబిలు, కర్టెన్సు, సూట్ కేసులు అన్నీ దాదాపు తగలబడిపోయో, సగం సగం తగలబడో వున్నాయి. పుస్తకాల రాక్‌లోని పుస్తకాలు కూడా చాలావరకు తగలబడ్డాయి.

కిరణ్ శవానికి చుట్టుపక్కల కిరోసిన్ టిన్స్‌కోసం చూశాడు. అయిదు లీటర్లుపట్టే జెర్రీకేన్ వుంది. అది కూడా చాలావరకు తగలబడి ముద్దగా అయింది. దాన్ని తీసి చూశాడు. వాసన కిరోసిన్‌ది కాదు—పెట్రోలుది!

వెనకనున్నగది వంటగది. దాంట్లో ఎక్కడా కిరోసిన్ స్టవ్‌లు లేవు. గాస్ పొయ్యి వుంది. మంటలకి సిలిండర్ పేలిపోనందుకు ఆశ్చర్యం కలిగింది కిరణ్‌కి. దగ్గరకుపోయి కదిపి చూశాడు. గాస్ లేదు. ఖాళీ సిలిండరు.

మంటలు ఆ గదికి కూడా పాకాయనటానికి నిదర్శనంగా అక్కడి వస్తువులు కూడా సగం సగం కాలి వున్నాయి. గదంతా ఫైర్ యింజన్‌లు వెదజల్లిన నీటితో

చి తడిగా తయారయ్యాయి.

"ఫైర్ సర్వీస్ చాలా సిన్సియర్ అని పక్కింటూరు చెప్పటమే కాదు, నేనూ చెబుతున్నాను" అన్నా కిరణ్.

శ్రీనివాస్ ఏమిటన్నట్టు చూశాడు.

"మంటలు గదుల్లోపల ప్రజ్వరిల్లుతున్నా కిటికీ గుండా వాటి నదుపుల్లోకి తెచ్చారే గాని, పొరపాటు కూడా గదుల్లోకి ప్రవేశించలేదు."

"మంటలు ప్రారంభదశలోనే వుండివుంటాయి!" శ్రీనివాస్‌కి వాళ్ళది పైచేయి కావటం యిష్టంలేదు.

"ప్రారంభదశ కాదు చివరిదశలో వున్నాయి మంటల శవం బొగ్గులా మాడిపోయి చాలా భాగం మాంసంకూ కాలిపోయింది. గదుల్లో వస్తువులు దాదాపు పూర్తి కాలిపోయాయి. గమనించలేదా?" అన్నాడు కిరణ సన్నగా నవ్వి.

"ఆల్ రైట్! ఇది ఆత్మహత్యేనంటావా? అదేఅయి శకుంతల యెందుకీ పని చేసింది? దివాకర్ గురించిన ని ఏదయినా తెలిసిందా? మనకి రాసినట్టే ఆమెకు కూ దుండగులు ఏదైనా లెటర్ రాశారా? అందులో దివా కర్‌ని చంపేసినట్టు రాసివుండాలి. అందుకే యీ భరించలేక ఆత్మహత్య చేసుకుని వుండొచ్చు" అన్నా శ్రీనివాస్.

కిరణ్ మాట్లాడలేదు.

శ్రీనివాస్ మళ్ళీ అన్నాడు. "ఇదే నిజమయితే శవం కచ్చితంగా దివాకర్‌దే అయివుంటుంది."

"మైడియర్ ఇన్‌స్పెక్టర్! శకుంతల ఆత్మహత్య చే

"లేదు, హత్య చేయబడింది!" అన్నాడు కిరణ్.

శ్రీనివాస్ అదిరిపడి చూశాడతనివంక.

"గదిలోని ప్రతి వస్తువుమీద పెట్రోలు చిలకరించి శకుంతల ఎటూ తప్పించుకునే అవకాశంలేకుండా చేసి, అగ్గిపుల్ల గీసి తగలబెట్టేశాడు హంతకుడు!"

"శకుంతల యిల్లంతా పెట్రోలు చిమ్మి అనక అంటించుకుని వుండొచ్చుగా!"

"మైడియర్ ఇన్‌స్పెక్టర్! చావాలనుకున్న మనిషి తన వొంటిమీదే పెట్రోలుగాని, కిరోసిన్ గాని పోసుకుని తగలబడుతుందిగాని, ఇల్లంతా జాగ్రత్తగా పెట్రోలుతో తడుపుకోదు. నీ అనుమానం ఇప్పుడే నివృత్తి చేస్తానుండు!" అంటూ కిరణ్ బయటికొచ్చి, యిందాక సాక్ష్యం చెప్పినాయన భార్యను పిలిచి అడిగాడు.

"చూడండమ్మా! మంటలు వచ్చినపుడు శకుంతల రక్షించుమంటూ కేకలు పెట్టిందా?"

"ఆఁ! కేకలు వినిపించే నేను బయటికి వచ్చానండి. అప్పటికే మంటలు బాగా పెద్దవైపోయాయండి. రెండు నిమిషాల తర్వాత శకుంతల గొంతు వినిపించలేదండి!" అన్నదామె.

కిరణ్ శ్రీనివాస్ వంక చూసి మెల్లగా "ఆత్మహత్య చేసుకునే మనిషి మౌనంగా తనపని చేసుకుపోతుందిగాని రక్షించమని ఎందుకరుస్తుంది?" అన్నాడు.

శ్రీనివాస్ దొరికిపోయినట్టు చూశాడతనివంక.

"మీ నిపుణుల్ని రంగంలోకి దిగమను!" అన్నాడు కిరణ్.

శ్రీనివాస్ తన సిబ్బందికి సూచనలిచ్చాడు.

3

"పాథాలజిస్టు రిపోర్టు వచ్చింది. డెంటల్ సర్జన్, మైక్రోబయాలజిస్టు రిపోర్టులు కూడా వచ్చాయి" అన్నాడు శ్రీనివాస్.

పోలీస్ స్టేషన్‌లో ఇద్దరు ఎదురెదురుగా కూచున్నారు.

"శవం దివాకర్‌ది కాదు, అవునా?" అన్నాడు కిరణ్.

శ్రీనివాస్ కళ్ళు పెద్దవిచేసి చూశాడు. "నీకెలా తెలుసు?"

"ఊహించాను. అదే నిజం కావాలనేంకాదు. యిలా కావచ్చునని ముందునించీ అనుమానిస్తున్నాను."

"అయితే అది దివాకర్ శరీరఖండాలని మనల్ని నమ్మించటానికి శత్రువులెందుకు ప్రయత్నించినట్టు?"

"మన కేసు పక్కదారి పట్టించటానికి! ఓ విధంగా డిపార్టుమెంటుని వాడలగొట్టడానికి."

"వీళ్ళు గుండెలు తీసిన బంటుల్లా వున్నారే! కేసంతా తికమకగా తయారయింది."

"నో, దివాకర్ చనిపోలేదన్న విషయం యింకా నిర్ధారణ జరగాల్సి వుంది."

"అదేమిటి, అలా అంటావు? ఎక్స్‌పర్టు డెంటల్ సర్జన్ రిపోర్టు నిజంకాదని అనుమానిస్తున్నావా? మైక్రోబయాలజిస్టు మన స్టేట్‌లోనే కాదు, యావద్భారత దేశంలోను ప్రఖ్యాతిగాంచినవాడు!

"నో నో, నేను వాళ్ళిద్దర్లో ఎవర్నీ శంకించటంలేదు. శత్రువులు పంపిన శవ ఖండాలు దివాకర్‌వి కాదన్నమాట నిజమే! ఈ శవం దివాకర్‌ది కానంతమాత్రాన దివాకర్ ఎక్కడోచోట బతికే వున్నాడని మనం ఆశించటం

లోనూ తప్పులేదు. కాని తమ గుట్టు రట్టు చేయటానికి తమని వెతుక్కుంటూ వచ్చినవాడ్ని శత్రువులు మట్టుబెట్టకుండా వదలరన్న సంగతి మనమూ గుర్తుంచుకోవటం మంచిది."

"యు ఆర్ రైట్! దివాకర్ చాలా పేరు ప్రఖ్యాతులున్న సి.ఐ.డి. అతను గతంలో డిపార్టుమెంటుకి ఎనలేని పేరు తెచ్చిన కేసుల్ని పరిశోధించాడు. ఎంత రిస్కు వున్న కేసునైనా ఒక్కడు భుజాలమీద వేసుకుని దాన్ని సాధించి తీర్తాడు. అతని గుండెబలం, దక్షత అలాంటివి!"

"అయితే, దివాకర్ ఉనికి తెలుసుకోగలిగితే మనం కేసులో ముందుకి చొచ్చుకుపోవటానికి స్కోప్ వుంది. శత్రువులు తెలివైనవాళ్ళు. దివాకర్ యీ భూమ్మీద లేడని నమ్మించటానికి చక్కటి పన్నాగం పన్నారు. నా వూహే నిజమైతే దివాకర్ చనిపోలేదు. బహుశా వాళ్ళకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతుండవచ్చు."

"ఎలా చెప్పగలవు?"

"దివాకర్ వాళ్ళ చేతికి చిక్కివుంటే నిర్దాక్షిణ్యంగా చంపేసి వుండేవాళ్ళు. ఇలా నకిలీ దివాకర్ శవాన్ని మనకి పార్సిల్ చేసే బదులు అసలు దివాకర్ శవాన్నే బహుమతిగా పంపించి వుండేవాళ్ళు! మనల్ని భయపెట్టి, కన్ఫ్యూజ్ చెయ్యాలనే ఉద్దేశ్యంతోనే అలా చేశారు."

"నాకూ అలాగే అనిపిస్తోంది.... సరే, యీ కేసు పరిష్కరించటానికి నువ్వొక్కడివే సమర్థుడవని నిన్నే సెలక్టు చేశారు మా డిపార్టుమెంటు హెడ్స్. అంచేత నువ్వు దివాకర్ మొదలుపెట్టిన యిన్వెస్టిగేషన్ విజయవంతంగా కొనసాగించి శత్రువుల ఆచూకీ తెలుసు

వాలి. నీకు యెలాంటి సహాయం కావలసినా చెయ్యమని డి.జి.పి. కమిషనర్ ఆఫ్ పోలీస్ మా డిపార్టుమెంటుకి ఆదేశాలిచ్చారు."

"ఓ.కే! మీ నమ్మకాలు వమ్ము చెయ్యను. ఈ రోజు నించే రంగం సిద్ధం చేసుకుంటాను. నువ్వు...."

కిరణ్ మాటలు పూర్తికాకుండానే టెలిఫోన్ గణ గణ మోగింది.

శ్రీనివాస్ అందుకుని, "హల్లో.... ట్రంకాలా? ప్లీజ్ కనెక్టు...." అన్నాడు.

కిరణ్ భృకుటి ముడిపడింది.

"ఎక్కడినించి కాల్?" అనడిగాడు.

"బొంబేనించి."

"అలాగా! దివాకర్ కావచ్చు. ఫోన్ ఇలా ఇవ్వు?" అన్నాడు కిరణ్.

శ్రీనివాస్ విస్మయంగా చూసి ఫోన్ అందించాడు.

"ఈజిట్ సిటీ క్రైంబ్రాంచ్?" అని వినిపించింది అవతలినుండి.

"ఎస్ ప్లీజ్!" అన్నాడు కిరణ్.

"అయామ్ ఎక్స్ జీరో టూ స్పీకింగ్!" అని వినిపించింది అవతలినుండి.

"ఎక్స్ జీరో టూ....?" అన్నాడు కిరణ్ ప్రశ్నార్థకంగా.

"అది దివాకర్ కోడ్ నెంబర్" అన్నాడు శ్రీనివాస్ గబగబ.

కిరణ్ సర్దుకుని, "హల్లో మిస్టర్ దివాకర్! హౌ ఆర్యూ?" అన్నాడు గొంతులో ఉత్సాహం నింపుకుని.

"అయామ్ ఆల్ రైట్ ఫర్ టైం బీయింగ్! ఈజిట్

ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్!"

"నో, అయామ్ డిటెక్టివ్ కిరణ్ స్పీకింగ్!"

"వెరీ గ్లాడ్ టు హియర్ యూ మిస్టర్ కిరణ్! మీరయితే ఇక ఏ సమస్యా లేదు. మీరు వెంటనే నన్ను బాంబేలోని హోటల్ తాజ్‌లో కలవండి. రూం నంబర్ ఫోర్ త్రీ టూ. నేనిక్కడ వున్నట్టు బాంబే పోలీస్‌కి గాని, యిన్వెస్టిగేషన్ బ్యూరోకిగాని, యెవరికీ తెలీదు. కోడ్ ఎర్ర గులాబీ ఇంకా సంభాషణ పొడిగించటం ప్రమాదం. కట్ చేసేస్తున్నాను" అంటూ ముగించాడు దివాకర్.

కిరణ్ రిసీవర్ క్రెడిల్ చేస్తూ, "వెరీగుడ్! శత్రువుల ఆచూకీ తెలిసిపోయినట్టే! మిస్టర్ శ్రీనివాస్! మనం వెంటనే బాంబే వెళ్ళాలి. దివాకర్ మనకి చాలా విషయాలు చెప్పవచ్చు. నువ్వు మీ అఫిషియల్స్‌తో మాట్లాడి బాంబే పోలీస్‌కి రహస్యంగా మన ప్రయాణం గురించి మెసేజ్ పంపించేసేలా చూడు. శాంతాక్రజ్ ఏర్‌పోర్టుకి బుల్లెట్ ప్రూఫ్ కారు పంపించమని చెప్పు. ఆ కారు పోలీస్‌దని ఎవరూ గుర్తుపట్టకుండా జాగ్రత్తలు తీసుకోమను" అన్నాడు.

"ఆల్ రైట్! యిప్పుడే అన్ని ఏర్పాట్లు చేస్తాను. సార్జంట్ రాజుని, సార్జంట్ శివాన్ని వైపర్సన్ పంపి నువ్వు చెప్పిన ఏర్పాట్లు చేయిస్తాను. ఏ ఫ్లైట్‌కి వెళ్దాం!"

"అదంతా తర్వాత సావకాశంగా మాట్లాడదాం. మనం వెళ్ళే ఫ్లైట్‌కి కూడా చాలా రహస్యంగా వెళ్ళాలి. శత్రువులు అనుక్షణం మనల్ని వెంటాడుతుండ వచ్చు. నేను డైరెక్ట్‌గా యిక్కడినుంచి యింటికిపోయి

ఆ తర్వాత నేరుగా బేగంపేట్ ఏర్‌పోర్టుకి వస్తాను. నువ్వు కూడా సరాసరి యిక్కడినుంచి రాకుండా మారువేషంలో ఎక్కడెక్కడో తిరిగి, ఏర్‌పోర్టుకిరా! ఫ్లైట్ మన పేర్లతో కాకుండా వేరే పేర్లతో బిజినెస్‌మీద వెళుతున్నట్టు సీట్సు రిజర్వు చేయించు. చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి."

"ఆల్‌రైట్! అవన్నీ నేచూసుకుంటాను, నువ్వు యింటికి వెళ్ళి నీ ఏర్పాట్లలో వుండు."

"అలాగే. నేను కూడా మారువేషంలో వస్తాను. ఏర్‌పోర్టులో నన్ను చూసి గుర్తుపట్టినా నేనెవరో తెలీనట్టు వ్యవహరించాలి! బి కేర్‌ఫుల్!"

4

శాంతాక్రజ్ విమానాశ్రయంలో ఫ్లైట్ దిగి ఎవరికి వారే విడివిడిగా బయటకొచ్చారు. కిరణ్, శ్రీనివాస్‌లు వాళ్ళని టాక్సీలవాళ్ళు చుట్టుముట్టారు. కిరణ్ సర్దార్జీ వేషంలోను, శ్రీనివాస్ ముస్లిం యువకుడి వేషంలోను వున్నారు.

"కహాఁ జానా సాబ్?" అంటూ వాళ్ళచేతుల్లోని సూట్‌కేసులు లాక్కోబోయారు టాక్సీవాళ్ళు.

కిరణ్ తన సూదంటు రాయిలాంటి చూపుల్ని టాక్సీ స్టాండుచుట్టూ గిర్రున తిప్పాడు. దూరంగా పార్క్ చేయబడివున్న స్కై కలర్ ఎంబాసిడర్ కనిపించింది. బుల్లెట్ ప్రూఫ్ కారు ప్రయివేట్ కారులా కనిపిస్తోంది. పోలీసు కారని యెవరూ వూహించలేరు.

కిరణ్ చకచక అటు నడిచాడు. సరిగ్గా అతను డోర్ తీసుకుని యిటునుంచి ఎక్కుతుండగానే అవతలపక్క నుంచి శ్రీనివాస్ ఎక్కేశాడు. కారు మరుక్షణంలో

ముందు ఉరికింది.

హోటల్ తాజ్ కి పోయే రోడ్ పట్టింది కారు. ఇంతలోనే వెనకనుంచి బుల్లెట్ దూసుకుంటూ వచ్చి కారును తాకి టప్ మని చప్పుడుచేస్తూ కిందపడింది.

కిరణ్ ఎలర్టుగా చూచున్నాడు. "మిష్టర్ శ్రీనివాస్! దాడి ప్రారంభమయింది. శత్రువులు మన ఉనికి కనిపెట్టే కారు" అన్నాడు.

శ్రీనివాస్ డ్రైవరు నుద్దేశించి, "క్యా సలీం, పోలీస్ స్టేషన్ సే సీదా ఆగయే క్యా?" అనడిగాడు.

"లేదు సార్! ముందుగా ఓ ఆటో మొబైల్ రిపేరింగ్ షాపుకి పోయి, రిపేరు చేయించినట్టు నటించి, ఊరంతా చక్కర్ కొట్టి ఏర్ పోర్టుకొచ్చాను. పోలీసు స్టేషన్‌లో పెట్టకుండా కారుని ఉదయమే తెచ్చి మా యింట్లో పెట్టుకున్నాను" అన్నాడు సలీం—డ్రైవరు—హిందీలో.

ఈ లోపల వెనకనుంచి మరో రెండు బుల్లెట్లు వచ్చి తగిలాయి. ఒకటి వెనుక అద్దానికి మరొకటి డిక్కీకి తగిలాయి.

కిరణ్ రేర్ వ్యూ మిర్రర్‌లో చూశాడు. వెనకనుంచి చాలా వేగంగా ఓ డాట్సన్ కారు, ఓ టాక్సీ దూసుకుంటూ వస్తున్నాయి. సలీం చాలా ఎక్స్‌పర్టులా వున్నాడు. నిదానంగా నడపకుండా అటు యిటు జిగ్ జాగ్ గా పోనిస్తున్నాడు కారుని. అందుకే వెనకనించి వస్తున్న వాళ్ళకు సరైన గురి కుదరటంలేదు.

కిటికీల్లోంచి బుల్లెట్స్ లోనికి రాకుండా ముందుగానే తామిద్దరు గ్లాస్ విండోస్ పైకి లేపేశారు సలీం తన రెండుపక్కల విండోస్ మొదట్నుంచీ మూసి వుంచాడు.

బుల్లెట్ ప్రూఫ్ కారు నెందుకు తెమ్మని అడిగాడో శ్రీనివాస్‌కి అర్థమయింది.

రోడ్డంతా నిర్మానుష్యంగా వుంది. రాత్రి పదిగంటలు దాటి పదిహేను నిమిషాలయింది. ఎదురుగా ఏమైనా కార్లు వచ్చినపుడు తప్ప, తక్కిన సమయాల్లో వెనుక నుంచి తమ కారుమీద బుల్లెట్ల వర్షం కురుస్తూనే వుంది.

కిరణ్ అప్పటికప్పుడే ఓ నిర్ణయానికొచ్చి, "శ్రీనివాస్! మనమిప్పుడు తాజ్‌కి వెళ్ళొద్దు. మన మెవరమో శత్రువులకి తెలిసిపోయింది. అలాంటప్పుడు తాజ్‌కి వెళ్ళి మనంతట మనమే శత్రువులకి దివాకర్ ఉనికి తెలియ చేయటం చాలా ప్రమాదకరం. సరాసరి పోలీస్ స్టేషన్‌కే పోదాం. మనం పోలీసులమని వాళ్ళకెటూ తెలిసిపో యింది. కాబట్టి కొత్తగా రహస్యం తెలిసేదంటూ ఏం లేదు" అని డ్రైవర్‌తో "సరాసరి స్టేషన్‌కే పోనియ్యి" అన్నాడు.

"సారీ, తాజ్‌కి బాగా దగ్గరకొచ్చేశాం" అన్నాడు సలీం.

కిరణ్ మెదడులో స్పార్క్ వెలిగింది.

కిరణ్ చటుక్కున కోటుజేబులోనుండి పిస్తోలు బయటికి తీసి సలీం తలకి ఆనించాడు. "ఎవరు నువ్వు? మేం నీకు తాజ్‌కు వెళ్ళమని చెప్పలేదు. నువ్వు తాజ్‌కే ఎలా తీసుకొచ్చావు? నువ్వు మా డ్రైవర్ సలీంకాదు. చెప్పు మర్యాదగా!" అన్నాడు.

ఊహించని జర్క్‌తో కారు ఆగిపోయింది. అంత వరకు సలీంగా వ్యవహరింపబడుతున్న డ్రైవరు మెరుపు వేగంతో డ్రైవర్ సీటులోంచి తలుపు చటుక్కున తెరుచుకుని రోడ్‌మీద పడిశాడు. వెనక వస్తూన్న

డాట్సన్ కారు ఒక్కక్షణం వాళ్ళ కారు పక్క ఆగి డ్రైవర్‌ని లోపలకు తీసుకుని మహా వేగంగా ముందుకి దూసుకుపోయింది. దాని వెనకనే టాక్సీకూడా దూసుకు పోయింది.

"శ్రీనివాస్ చాలా పొరపాటు జరిగిపోయింది. డ్రైవర్ మనవాడేనన్న ఓవర్ కాన్ఫిడెన్స్‌తో మనమే మననోటితో దివాకర్ తాజ్‌లో వున్న విషయం చెప్పే శాం. మన డ్రైవర్‌ని మోసంచేసి మన కారుని వీళ్ళు కిడ్నాప్ చేసి మనల్ని రిసీవ్ చేసుకోవటానికి ఏర్‌పోర్టు వచ్చారు. వాళ్ళకి యీ క్షణంవరకు దివాకర్ యెక్క డుంటున్నదీ తెలీదు. నా వూహే నిజమయితే యీసరికి వాళ్ళు తాజ్‌లో వుంటారు. కమాన్ హారియప్!" అంటూ కిరణ్ వెనక సీట్లోంచి డ్రైవర్ సీట్లోకి మారి కారు స్టార్టుచేశాడు.

అయిదు నిమిషాల్లో డిటెక్టివ్‌లున్న కారు హోటల్ తాజ్ పోర్టికోలో వుంది.

కిరణ్ తలుపు తెరుచుకుని హోటల్ వెనకపక్క నుంచి పరుగెత్తుకుంటూ మెట్లవైపు చొచ్చుకుపోయాడు. శ్రీనివాస్ అనుసరించాడు.

లిఫ్ట్‌కోసం చూడకుండా మూడేసి మెట్లు నొక్కసారి ఎక్కుతూ ప్రతి ఫ్లోర్‌లోనూ రూం నెంబర్ వెరిఫై చేసుకుంటూ థర్డ్ ఫ్లోర్‌కిచేరాడు. రూం నంబర్సు మూడు వందలనుంచి మొదలయ్యాయి. అందుకే నాలుగో ఫ్లోర్‌లోనే ఫోర్ త్రీ టూ నంబర్ దొరికింది.

కిరణ్ ఒక్కపరుగున ఆ రూం దగ్గరికి పరుగెత్తాడు. తలుపులు దగ్గరగా వేసివున్నాయి. తోసుకుని వెళ్ళాడు.

అక్కడి దృశ్యం అతను వూహించినట్లే వుంది.

గదంతా చిందరవందరగా వుంది. తలుపు పక్కగా రూం బాయ్ రక్తం మడుగులో పడున్నాడు.

కిరణ్ ఒక్క క్షణంలో గదిని, లావెట్రీని చుట్టేశాడు.

గదిలో ఎక్కడా దివాకర్ జాడలేదు.

5

కాసేపటివరకు యిద్దరు మౌనంగా నిల్చున్నారు. కిరణ్ తలుపు దగ్గరికివేసి బోల్టువేశాడు.

"మన అజాగ్రత్తవల్ల ఓ నిండు ప్రాణాన్ని చేజేతులా తీశామేమోననిపిస్తోంది" అన్నాడు కిరణ్—అతని మనసు ఈ సంఘటనతో వికలమయిపోయింది. తామిద్దరు మాటల సందర్భంలో అసలు విషయం బయటపెట్టేశారు. దాంతో శత్రువులకి దివాకర్ ఆచూకీ తెలిసిపోయింది.

"రూం నెంబర్ ఎలా తెలిసిందో అర్థంకావటంలేదు" అన్నాడు శ్రీనివాస్.

కిరణ్ వినిపించుకోకుండా గదంతా కలియజూశాడు.

గది పెద్దదే! ఓ బెడ్, టేబిలు, రెండు కుర్చీలు, వున్నాయి గదిలో. రాక్‌లో కొన్ని పుస్తకాలున్నాయి. మంచంకింద ఓ సూట్‌కేస్ వుంది. గోడకి తగిలించి ఓ ఏర్ బాగ్ వుంది.

సూట్‌కేస్ అడుగున దివాకర్ ఐడెంటిఫికేషన్ కార్డు ఫోటోతోబాటు వుంది. 'ఎక్స్ జీరో టూ' వున్న కోడ్ నంబరు దిగువన వేసివుంది.

"దివాకర్ వచ్చినప్పట్నుంచీ ఇదే హోటల్లో మకాం చేసివుండాలి" అన్నాడు శ్రీనివాస్.

"వారం రోజులేగా అయింది? బహుశా హోటల్ రిజిస్టర్లో మారుపేరుతో రూం బుక్ చేసి వుండొచ్చు" అన్నాడు కిరణ్. మంచంమీదున్న పరుపు పైకెత్తి

చూశాడు.

పరుపుకింద ఏమీ లేదు.

అయితే పరుపు మామూలుగా వేసేస్తుంటే పరుపు లోపల గరగర చప్పుడయింది. కిరణ్ మస్తిష్కం తీవ్రంగా పని చేస్తోంది. పరుపుకి ఓ పక్కగా రంధ్రం చేసి వుంది. ఆ రంధ్రంగుండా చెయ్యి తోపాడు.

చేతికి ఏదో కాగితం తగిలింది. బయటికితీశాడు. ఏదో ప్లాన్ లాగా వుంది.

కాగితాన్ని టేబిల్ మీద పరిచి దానివంక నే తదేకంగా చూడసాగాడు కిరణ్. శ్రీనివాస్ అతని చర్యల్ని పూర్తిగా గమనిస్తున్నాడు. తనూ ఒంగి కాగితంలోకి చూశాడు. అతనికేం అర్థంకాలేదు.

అది అరఠావు సైజు కాగితం!

కాగితానికి చుట్టూ బోర్డర్ లా గీచివుంది.

కాగితం మధ్యగా కొలను. దానిలో కలువ పువ్వు గీచివుంది. వెనక కొండల బారు చూపించబడివుంది. కొండలబారుకి కొలనుకి మధ్య పడగవిప్పిన తాచుపాము బొమ్మ వుంది. బోర్డర్ కి ఓ పక్క కుడివైపు సముద్ర కెరటాలు ఉవ్వెత్తున లేచిపడుతున్నట్టు గీయబడి వుంది. ఎడమవైపు బోర్డర్ కి కొంచెం దిగువగా సింహం తల బొమ్మ గీచివుంది.

కిరణ్ చాలాసేపు ఆ బొమ్మవైపే తీవ్రంగా ఆలోచిస్తూ చూశాడు.

శ్రీనివాస్ ప్రశ్నార్థకంగా చూశాడు కిరణ్ వంక.

కిరణ్ కాగితాన్ని మడిచి కోటుజేబులో పెట్టుకున్నాడు. ఇంకాసేపు పుస్తకాల్ని, సూట్ కేస్ ని ప్రతి సెంటిమీటరు పరీక్షగా చూశారిద్దరు.

ఇంతలో తలుపుకి పక్కనున్న బజర్ మోగింది.

కిరణ్ సాలోచనగా శ్రీనివాస్ వంక చూసి, వెళ్ళి తలుపు బోల్టు తీశాడు.

బయట హోటల్ మేనేజర్ కాబోలు నిలబడి వున్నాడు.

"సార్, మీ రెవరో తెలుసుకోవచ్చా?" అన్నాడు తను హిందీలో.

కిరణ్ అతనివంక పరీక్షగా చూసి, "ఈ రూంలో బసచేసిన ఆయన స్నేహితులం!" అన్నాడు.

"మిష్టర్ అశోక్ వున్నారా లోపల?"

"లేరు!"

"ఇందాకా మా బోయ్ మీ రూంకి సర్వీసింగ్ చేయటానికొచ్చాడు. గంటదాటినా అతను మీ రూంనించి తిరిగిరాలేదు."

"అతనెప్పటికీ తిరిగిరాడు!"

"అదేమిటి సార్, అలా అంటున్నారు?"

"ఇలా ఓసారి లోపలికొచ్చి చూడండి!" కిరణ్ గుమ్మంలోనుంచి అడ్డుతొలగి నించున్నాడు.

మేనేజర్ లోనికి చూస్తూనే అదిరిపడ్డాడు.

"వ్వాట్? హత్యా? ఎవరు చేసారీపని?"

"అది మాకు తెలియదు."

"అయితే మీరు అశోక్ ఫ్రెండ్సు కాదా?"

శ్రీనివాస్ తమ ఐడెంటిటీతీసి చూపించాడతనికి.

మేనేజర్ నమ్రతగా నమస్కరించి, "మా హోటల్లో యిలాంటి దారుణం జరగటం, అందునా మా ఉద్యోగి హత్యచేయబడటం యిదే మొదటిసారి. యెవరుచేశారో, వాడినుంచి ఏమి ఆశించి చంపారో అర్థంకాకుండా

వుంది" అన్నాడు.

"వాడినుంచి ఏమీ ఆశించి చంపలేదు. మిష్టర్ అశోక్‌ని యెవరో అపహరించుకుపోయారు. మీ బాయ్ వాళ్ళని చూశాడు. మళ్ళీ వాళ్ళని గుర్తుపట్టకుండా శాశ్వతంగా వాడి నోరు మూయించేశారు."

"వాట్ సార్? అశోక్‌గార్ని కిడ్నాప్ చేశారా? అన్నీ వింతగా అనిపిస్తున్నాయి నాకు. ఈ బోయ్ హత్య గురించి తెలిశాక హోటల్లో పని చేయటానికి బాయ్స్ భయపడిపోతారు. మిష్టర్ అశోక్ విషయం తెలిస్తే మా హోటల్‌కున్న గుడ్‌విల్ పోతుంది. దయచేసి మీరీ విషయాలేవీ లీక్ చెయ్యొద్దని ప్రార్థన."

"అవసరమైతే తప్ప కావాలని బయటపెట్టం. కాని మా హోటల్లో ఓ గదిలో జరిగే విషయం పక్కనున్న వాళ్ళకిగాని, తక్కిన ఇన్‌మేట్స్‌కిగాని తెలియకపోవటం విచిత్రంగా వుంది."

"అసలు మా హోటల్ ప్రత్యేకతే అది సార్! ఎవరిమటుకు వాళ్ళకు యిండిపెండెంటుగా వుండాలనే ఉద్దేశంలో మా రూంస్ ప్రత్యేకించి కట్టించాం. ప్రైవసీ కోసం సిటీలో మా హోటల్‌నే యెన్నుకుంటారు శ్రీమంతులు. అదే మిష్టర్ అశోక్ కిడ్నాపింగ్ విషయంగాని, మా బాయ్ హత్య విషయంగాని మాకు మీరు చెప్పేవరకు తెలియకుండా పోవటానికి కారణం!"

ఇంతలో గదిలోని ఫోన్ మోగింది.

కిరణ్ ఒక్క అంగలో ఫోన్ సమీపించి రిసీవర్ ఎత్తి "హల్లో!" అన్నాడు.

అవతలినుంచి ఓ కర్కశమైన స్వరం వినిపించింది.

"డియర్ కిరణ్! ఇప్పటికైనా తెలిసిందా మా ప్రయోజకత్వం? యెందుకు అనవసరంగా ప్రాణాలు పోగొట్టుకుంటావు? గో బాక్!"

"మిష్టర్! నువ్వెవరో తెలీదుగాని, ఉత్త పిరికిపందవని అర్థమవుతోంది" అన్నాడు కిరణ్ నిదానంగా.

"ఏమిటి అహంకారం?"

"అహంకారం కాదు మిష్టర్! యెదురుపడి పోరాడే ధైర్యంలేకనే నువ్వు వెనక దెబ్బ తీస్తున్నావు. మా ఏజెంటుని కిడ్నాప్ చేసినంత మాత్రాన నీకేమిటిలాభం?"

"లాభమా? మీ ఏజెంటు మా రహస్యాలన్నీ కనుక్కున్నాడు. బయటపెడతానని గర్వంగా చాటి చెప్పాడు. అసలు చంపేయాలనే అనుకున్నాం. త్వరలో అదీ జరుగుతుంది. యెలాగూ మీ ఇద్దరు—నువ్వు, ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ — సిటీలోనే వున్నారుగా! మీ ఫ్రెండ్ శవాన్ని మీకే అప్పగించేస్తాం!"

"మిష్టర్, ఊరికే గొప్పలు చెప్పుకోకు! మా ఏజెంటు అంత తెలివితక్కువ వాడేం కాదు — మీ చేతుల్లో చావటానికి!"

"అదీ చూద్దాం. ఈ లయన్‌తో పెట్టుకున్నవాళ్ళెవరూ బతికి బట్టకట్టిందిలేదు! మా కార్యకలాపాలకి అడ్డొచ్చిన వాళ్ళందర్నీ నిర్దాక్షిణ్యంగా కాల్చిపారేశాం. బొంబే పోలీసుల్ని అడిగి చూడు—ఎంతమందిని వదులుకున్నారో తెలుస్తుంది. అందుకే వాళ్లెవరూ మా జోలికి రావటం మానేశారు. లయన్ అంటే వాళ్ళకు సింహస్వప్నం! నా మాట విని వచ్చిన దారినే తిరిగిపో! నీ వెంట వచ్చిన పోలీసాయన్ని కూడా తీసుకుపో!"

కిరణ్ నవ్వాడు—"ఎవరు ఎవరికి సింహస్వప్నమో

నీ మాటలే చెపుతున్నాయి. అయినా నీతో వాదించటం అనవసరం! నువు యిండియన్‌వే అయితే, నీలో మాతృదేశంమీద భక్తి, గౌరవం వుంటే వెంటనే నీ వృత్తికి స్వస్తి చెప్పు! నువ్వు పరాయి దేశస్థుడివయివుంటే వెంటనే మా దేశం వదిలి నీ దేశం పారిపో!" అన్నాడు.

అవతల ఫోన్‌లో వికృతమైన నవ్వు వినిపించింది. "లయన్‌ని బెదిరించినవాడివి నువ్వొక్కడివే కనిపించావు. సరే, నా మాట పెడచెవిన పెడుతున్నావు. నిన్నూ, నీ ఇన్‌స్పెక్టర్ని ప్రాణాలతో వదిలేదిలేదు, గుర్తుంచుకో!"

"చేసేవాడు యిన్నిసార్లు చెప్పడు! మిస్టర్ లయన్! మర్యాదగా మా ఏజెంటు నప్పజెప్పెయ్యి. పోలీస్‌కి సరెండర్ అయిపో! నీకు శిక్ష తప్పకపడేలా నే చూస్తాను."

అవతల చాలా కోపంగా ఫోన్ పెట్టేసిన చప్పుడు.

కిరణ్ ఆదేశానుసారం బయిటికి వెళ్ళిన శ్రీనివాస్ లోనికొస్తూ, "ఫోన్ జుహూ బీచ్ ఏరియానించి వచ్చింది. ఆపరేటర్ నడిగితే మన నెంబరు చెపుతున్నాడుగాని, ఆ ఫోన్ నంబరు చెప్పలేకపోయాడు" అన్నాడు.

కిరణ్ మెదడులో తన జేబులో వున్న కాగితంమీది ప్లాన్ ముద్ర పడిపోయింది. శత్రువు మాటల్లో అతని లయన్ అని చెప్పుకున్నాడు. ఎడమవైపు గీచిన 'సింహపు తల' బహుశా శత్రువుల సింబల్‌ని సూచిస్తున్నాయి. సముద్రకెరటాలు జుహు బీచ్‌ని సూచిస్తున్నాయి. అంటే ఆ ప్లాన్ కాగితం శత్రువుల స్థావరాన్ని వివరిస్తోందన్న మాట!

అయితే కొలను, కొండలబారు, పడగవిప్పిన తాచు పాము, కొలనులోని కలువ పువ్వు-ఇవి వేటికి సంకేతాలో

తను తెలుసుకోవాల్సి వుంది!

అంతసేపూ మేనేజర్ అక్కడే నిలబడి వున్నాడు—అప్పటికి హోటల్ సిబ్బందికి రూం బాయ్ విషయం చూచాయగా తెలిసినట్టుంది. ఒకరొకరు అక్కడికి చేరుకుంటున్నారు.

కిరణ్ మేనేజర్ వంక తిరిగి, "అయామ్ సారీ! పోలీస్‌కి మేం చెప్పక తప్పదు. అయితే యిది పదిమందికీ పబ్లిసిటీ కాకుండా చూస్తాం లెండి. కాని పత్రికలవాళ్ళు సైలెంట్‌గా వుంటారని నేననుకోను. వాళ్ళకి ఏమాత్రం క్లూ అందినా మీ హోటల్‌తో బాటు అన్ని సంగతులు ప్రచురించి తీర్తారు" అన్నాడు.

"పత్రికలవాళ్ళ విషయం మేం యిదివరకే అనుభవించి వున్నాం సార్! సరే, మీ బాధ్యత మీరు నిర్వర్తించండి!" అన్నాడు మేనేజర్.

కిరణ్ పోలీసులకి ఫోన్ చేశాడు.

6

హోటల్ కాంటినెంటల్ రూంలో డిటెక్టివ్ కిరణ్, శ్రీనివాస్ కూచుని వున్నారు.

"మనమింకా హోటల్ తాజ్‌లోనే వున్నామని లయిన్ వాళ్ళు పొరబడుతుండవచ్చు!" అన్నాడు శ్రీనివాస్. కిరణ్ వెంటనే మాట్లాడలేదు.

ఇద్దరు మారువేషాల్లో వున్నారు. కిరణ్ ముస్లిం యువకుడిలాగాను, శ్రీనివాస్ కాబూలీవాలా వేషంలోనూ వున్నారు.

"దివాకర్ రూంకి మళ్ళీ లయిన్ వచ్చివుంటాడంటావా?" అడిగాడు శ్రీనివాస్.

"ఇక రాకపోవచ్చు! ఆ రూంలో వాళ్ళకు పనికివచ్చే

సమాచారం ఏదీ దొరికి వుండదు. మనం వచ్చేటప్పటికి అతని నివాసమంతా వెరిఫై చేసేసుకున్నారు కదా! కాకపోతే దివాకర్ తెలివిగా పరుపులో దాచిన కాగితం వాళ్ళకంట పడలేదు. మనం మరోసారి దివాకర్ రూంకి వెళ్ళాల్సి వుంటుంది. లయిన్ మొత్తం కార్యకలాపాలను గురించి కూడా వివరాలు ఎక్కడో రాసిపెట్టి వుంటాడు దివాకర్. అది కూడా ఏదో 'కోడ్'లోనో, మరో అర్థం కాని విధాలగానో రాసివుంటాడు...." కిరణ్ యింకా ఏదో అంటుండగానే 'సర్'మంటూ గాలిని కోసుకుంటూ బుల్లెట్ దూసుకొచ్చింది.

కిరణ్ శ్రీనివాస్ తలపట్టుకుని కిందికి అదిమి తనూ వంగాడు. బుల్లెట్ గోడకు తగిలింది.

కిరణ్ మెరుపులా కిటికీ దగ్గరకు పరుగెత్తి తొంగి చూశాడు. కింద డాట్సన్ కారు స్టార్టయింది. ఓ వ్యక్తి చటుక్కున కార్లోకి జొరబడ్డాడు. కారు మహావేగంగా వెళ్ళిపోయింది.

శత్రువులకి మన వునికి తెలిసిపోయింది. మనం ఈ హోటల్లో బసచేసిన విషయం కనిపెట్టేశారు" అన్నాడు శ్రీనివాస్‌తో కిరణ్.

శ్రీనివాస్ సాలోచనగా చూశాడు.

"మనం జుహూ బీచ్‌కి వెళ్ళివద్దాం. అదేవిధంగా ఓసారి పోర్టుకి కూడా వెళ్ళి ఈ మధ్య వారం పది రోజులుగా స్నేక్ లెదర్ గాని, గంజాయివంటి యితర ప్రోహిబిటెడ్ గూడ్స్ ఏవైనా కస్టమ్స్‌వాళ్ళు పట్టుకున్నారేమో కనుక్కోవాలి. దివాకర్ ప్లాన్ కాగితంలోని ఐటమ్స్‌ని డీకోడ్ చేసి చూడాలి. కొలను, తామర పువ్వు, తాచుపాము, కొండల బారు—యివన్నీ ఒక

దానితో మరొకటి యింటర్ కనెక్టెడ్‌గా వున్నాయి"
అన్నాడు కిరణ్.

"ఆ కాగితం ఓసారి యిస్తావా?" చేయి చాపాడు
శ్రీనివాస్.

"వద్దు. గోడలకి కళ్ళు, చెవులు వుంటాయి. మన
శత్రువుల కంటపడనిదేమైనా వుందా అంటే, యిప్పటి
వరకు ఆ కాగితం ఒక్కటే! అది కంటపడితే వాళ్ళు
తమ స్థావరాన్ని చాలా అర్జంటుగా మార్చేసే ప్రమాద
ముంది" అన్నాడు కిరణ్.

శ్రీనివాస్ తలూపాడు.

"వేషం మార్చు" అన్నాడు కిరణ్, కిట్ పైకితీస్తూ.

మళ్ళీ వేషాలు మార్చుకోవటం మొదలుపెట్టారు.

కిరణ్ తల పండిపోయింది. మీసం గడ్డం తెల్లగా
మారిపోయాయి. పంచె, లాల్చీ ధరించాడు. శ్రీనివాస్
పిల్ల జమిందారు దుస్తుల్లోకి మారిపోయాడు. ఎంబ్రాయిడరీ
చేసిన ఖరీదైన సిల్కు లాల్చీ, పైజామా వేసుకున్నాడు.

మరో పదినిమిషాల తర్వాత బొంబే పోర్టులోని అధి
కారులతో మాట్లాడుతున్నారిద్దరు.

"నో సార్, అలాంటి గూడ్సు ఏవీ ఎక్స్‌పోర్టు
కాలేదు" అన్నాడు కస్టమర్సు అధికారి.

"అనుమానాస్పదమైన పార్సిల్సుగాని, మనుషులుగాని
యెదురుపడితే వెంటనే మాకు తెలియపర్చండి. వాళ్ళని
ఎలాగైనా డిటెన్ చేసి వుంచండి. చాలా అవసరం"
అన్నాడు కిరణ్.

తర్వాత యిద్దరు జుహూ బీచ్‌కి వెళ్ళారు.

సాయంత్రం అయిదుగంటల సమయం. బీచ్‌లో
కోలాహలం పెరుగుతోంది. జంటలు జంటలుగా యువతీ

యువకులు నెట్టాపట్టా లేసుకుని అటు యిటు తిరుగు తున్నారు. కూచుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

"ఎక్కడ చూసినా జంటలే! ఈ బీచ్ లవర్సుకి పెట్టింది పేరని గతంలో విన్నాను" అన్నాడు శ్రీనివాస్.

కిరణ్ దివాకర్ ప్లాన్ కాగితం గురించే ఆలోచి స్తున్నాడు. బీచ్ కి దగ్గర్లో ఎక్కడా కొండలు గుట్టలు కనిపించటంలేదు. కొలను కూడా ఏదీ వున్నట్టు లేదు. మరి అందులో అవి ఎందుకు సూచించాడు దివాకర్?

"దివాకర్ని వాళ్ళు యేమైనా చేస్తారేమో...." అన్నాడు శ్రీనివాస్ మెల్లగా.

"నేనూ అదే అనుమానిస్తున్నాను. ఇంతవరకు అతను వాళ్ళకు దొరక్కుండా తప్పించుకుని వాళ్ళ సమా చారాలు సేకరించాడు. ఇప్పుడు మన కారణంగా దొరికి పోయాడు. వాళ్ళు అతన్ని చిత్రహింస చేయకుండా వదలరు. అసలు ప్రాణాలతో అతన్ని కళ్ళ చూస్తామా అని అనుమానం నాకు!"

"ఈ లోపల వాళ్ళ స్థావరం తెలిస్తే బావుణ్ణు!"

"అదే నా ప్రయత్నం కూడా! బాంబే పోలీసుకి ఎల ర్టుగా వుండమని చెప్పావు కదూ! యే క్షణంలో పిలిచినా ఒక్కుమ్మడిగా వచ్చేలా ఏర్పాటు చెయ్యి."

"అన్నీ వివరంగా కమిషనర్ లోను, డి.జి.పి.తోను మాట్లాడాను. యే క్షణంలో పిలిచినా పలుకుతారు. ప్రస్తుతం మన చుట్టుపక్కల మఫ్టీలో వున్నారు కొంత మంది. వాళ్ళను మనకు ఎస్కార్టుగా పంపారు. అవసర మైతే వాళ్ళని ఉపయోగించుకోవచ్చు."

కిరణ్ చుట్టూ పరిశీలనగా చూశాడు. పదిమీటర్ల పరిధిలో కొంతమంది పోలీసు సిబ్బంది మఫ్టీలో తిరుగు

తున్నారు. చూసీ చూడనట్టు తమ వంక చూస్తున్నారు. తాము కనుసైగ చేసినా అందుకునేటంత యెలర్టుగా వున్నారు.

"గుడ్! మంచి ఏర్పాట్లు చేశావు" అన్నాడు కిరణ్ ప్రశంసగా. శ్రీనివాస్ ఉబ్బిపోయాడు.

7

బీచ్‌కి యెడమవైపు దృష్టిసారించిన కిరణ్ అక్కడి దృశ్యాన్ని చూసి ఉలిక్కిపడ్డాడు. దూరానికి బంగారు రంగు అక్షరాలు మెరుస్తున్నాయి. 'హోటల్ లోటస్' అని! కిరణ్ మస్తిష్కంలో మెరుపులు మెరిశాయి.

లోటస్ అన్న పదం కలువ పువ్వును సూచిస్తోంది. అంటే ప్లాన్‌లోని కలువ పువ్వు ఈ హోటల్‌కి సంకేత పదంగా ఉపయోగించలేదుకదా! అతని అనుమానం మరి కొద్ది క్షణాల్లో తీరిపోయింది.

హోటల్ లోటస్ ఎత్తయిన కొండమీద కట్టబడి వుంది. హోటల్ బాక్‌గ్రౌండ్‌లో కొండలు బారులు తీరి కనిపిస్తున్నాయి. అదంతా రాత్రి ప్రదేశం!

కిరణ్ లేచాడు. కొంత దూరంగా కూచుని వున్న శ్రీనివాస్ కూడా లేచాడు.

వాళ్ళు ముందుకి సాగుతుంటే వెనకనుండి మఫ్టీలో వున్న పోలీసులు కూడా అడుగులో అడుగు వేసుకుంటూ దూరంగా వెంబడిస్తూ నడవసాగారు.

'హోటల్ లోటస్' వున్న కొండ చేరటానికి దాదాపు యిరవై నిమిషాలు పైనే పట్టింది. చాలా దూరంగా వున్నట్టు కనిపించిందేగాని దూరం కిలో మీటరుకి తక్కువలేదు.

కిరణ్ శ్రీనివాస్ విడివిడిగా నడుస్తున్నారు. కిరణ్

తన ఆకారంవంక చూసుకున్నాడు. గడ్డం మాసినట్లు కనిపించినా తను ధరించిన ఖరీదైన లాల్చీ, సిల్కుపంచె తను ఓ ఉన్నత కుటుంబంలోని వ్యక్తి అని చెప్పకనే చెప్పుతున్నట్టున్నాయి. శ్రీనివాస్ ఆకారం గాలికి తిరిగే పోకిల్లా జమిందారులా వుంది. కాబట్టి ఆ హోటల్లో ప్రవేశానికి తమని అభ్యంతరపెట్టే వాళ్ళు యెవరూ వుండరని అతనికి తెలుసు.

కిరణ్ కొండపైకి చక్కగా నిర్మించబడ్డ పాలరాతి మెట్లు యెక్కుతూ పరిసరాలు జాగ్రత్తగా గమనిస్తున్నాడు. అతనికి అయిదారు మెట్లు దిగువన శ్రీనివాస్ ఎక్కుతూ వస్తున్నాడు. వాళ్ళిద్దరికీ బాగా దూరంగా, కిందుగా మఫ్టీలో వున్న పోలీసులు!

కిరణ్ హోటల్ లోటస్ ఎంట్రన్స్ దగ్గర ఆగాడు. లోటస్ ఎంట్రన్స్‌కి యెడమపక్కగా లాన్స్ వున్నాయి. చక్కటి అశోక వృక్షాలు హోటల్‌కి యిరుపక్కలా స్వాగతం పలుకుతున్నాయి. లాన్స్ నిండా పూల తోటలు, గులాబీ మొక్కలు విస్తారంగా వున్నాయి. గార్డన్ పార్టీ చేసుకోవటానికి వీలుగా రెండు పక్కలా చక్కగా టేబిల్సు అమర్చి వున్నాయి.

కిరణ్ ఒక్క క్షణం ఆలోచించి, యెడమపక్కగా వున్న దారిగుండా లాన్స్‌లోకి నడిచాడు. అక్కడ ఎదురుమదురుగా కస్టమర్సు కూచుని వున్నారు. వాళ్ళు మద్యాన్ని సేవిస్తూ కబుర్లు చెప్పుకుంటున్నారు. ఆడ మగ తేడా లేకుండా తాగుతున్నారు, తింటున్నారు.

కిరణ్ వాళ్ళ పక్కగా ముందుకి వెళ్ళాడు. ఇప్పుడు వెనకపక్కనున్న కొండలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కిందినుంచి మూసే హోటల్‌కి అంటిపెట్టుకున్నట్టు కని

పించిన కొండలు హోటల్ కి చాలాదూరంగా వున్నాయి.

హోటల్ కి, కొండల బారుకి మధ్య రకరకాల రంగుల దీపాలతో వెలిగిపోతోంది ఓ స్టాలు. దానిపైన రంగు దీపాల డిజైన్ తో 'అమ్యూజ్ మెంటు పార్కు' అని రాసివుంది. దానికి పక్కనే దీపాలంకరణతో మెరిసిపోతున్న బొమ్మని చూసి కిరణ్ కళ్ళు తళుక్కున మెరిశాయి.

అక్కడ పడగవిప్పిన తాచుపాము బొమ్మ నిజమైన తాచు బుసలుకొడుతున్నట్టే మెరిసిపోతోంది!

8

కిరణ్ కి సమస్య విడిపోయింది. బహుశా యీ అమ్యూజ్ మెంటు పార్కే శత్రువుల నివాసమయి వుంటుంది. మనసులోనే దివాకర్ దూరదృష్టికి, మేధాసంపత్తికి జోహార్లర్పించాడు కిరణ్.

కిరణ్ ఓ క్షణం వెనుతిరిగి చూసి, సరాసరి అమ్యూజ్ మెంటు పార్కులోకి నడిచాడు. శ్రీనివాస్ అతని చూపులోని సందేశాన్ని అందుకున్నాడు. అతను వెనుతిరిగి చూశాడు. అతని ఆదేశాల నందుకోవటానికి వెనక మఫ్టీ పోలీస్ సిద్ధంగా వుంది.

కిరణ్ పార్క్ లోపలికి ప్రవేశించాడు. లోపల రకరకాల జూదాలు జోరుగా సాగిపోతున్నాయి. రమ్మీ, మూడుముక్కలాట, రన్నింగ్ వీల్, లక్కీడిప్స్ రకరకాల ఆటలు.

దూరంగా డిమ్ గా వెలుగుతున్న లైట్ల మధ్య స్టేజి. స్టేజిపైన కాబరే డాన్సర్ అందంగా ఊగుతోంది. గోడల కమర్చిన మైక్రోఫోన్ లగుండా మంద్రమైన సంగీతం. ఆ సంగీతం మత్తులో ఊగుతున్న జంటలు!

అదంతా ఓ ప్రత్యేకమైన లోకంలా వుంది.

కిరణ్ కాసేపు ఓ టేబిల్ ముందు కూచున్నాడు. డ్రింక్స్ సర్వ్ చేయబడ్డాయి. స్టేజీమీదున్న కాబరే డాన్సర్ని కళ్ళతోనే జుర్రేస్తున్న యువకులు ఓ పక్క హాట్ డ్రింక్స్ సిప్ చేస్తూ కూచున్నారు. కూచున్న చోటినుంచి లేచి డాన్స్ చేసి మళ్ళీ కూచుంటున్నారు.

కిరణ్ లేచాడు. సరాసరి టాయ్లెట్ అని రాసున్న రూంవైపు నడిచాడు. లోపల పూర్తి ఏర్ కండిషన్ చేయబడి, చలి వణుకుపుడుతున్నాయి. టాయిలెట్ పక్కనుంచి చిన్న ద్వారముంది.

కిరణ్ ఆ ద్వారంనుంచి అవతలిపక్క హాల్లోకి ప్రవేశించాడు. ఒక్క క్షణం పులినోట్లో తల దూర్చుతున్న అనుభూతి కలిగిందతనికి! అయినా వెనక్కుతియ్యలేదు. లాల్చీ జేబు తడుముకున్నాడు. రివాల్వర్ చల్లగా తగిలింది.

హాలు నిర్మానుష్యంగా వుంది. లోపలి హాలు ఎంత సందడిగా హడావిడిగా వుందో ఈ హాలు అంత స్తబ్ధంగా నిశ్శబ్దంగా వుంది. ఒక్కో అడుగే తీసివేస్తున్నాడు కిరణ్.

పక్కన ఏదో అలికిడి అయింది. తలతిప్పి చూసేసరికి ఆలస్యమయిపోయింది. నెత్తిపైన వెయ్యి మణుగుల బరువు సమ్మెట దెబ్బలాంటి దెబ్బ!

వెంటనే కుప్పలా కూలిపోయాడు కిరణ్. మరుక్షణం అతనికి స్పృహ తప్పిపోయింది.

• • •

శ్రీనివాస్ కిరణ్ కూచున్న టేబిల్కి నాలుగు టేబిల్స్ యివతల కూచున్నాడు. కిరణ్ లేచి టాయిలెట్

వైపు వెళ్ళటం గమనించాడు.

అయిదు నిమిషాల తర్వాత ఓసారి చుట్టూ పరిశీలనగా చూశాడు. దూరంగా మఫ్టీ కానిస్టేబిల్స్ వున్నారు. తక్కిన వాళ్ళంతా యెవరి పిచ్చిలో వాళ్ళున్నారు. తనని ప్రత్యేకించి యెవరూ గమనించటంలేదని అతను గ్రహించాడు.

లేచాడు. నాలుగడుగులు వేసి టాయిలెట్ పక్కకి చేరుకున్నాడు. ఆగి చుట్టూ చూశాడు. మఫ్టీ కానిస్టేబుల్స్ తన ఆదేశాలకోసం తనవైపే చూస్తున్నారు. తక్కిన వాళ్ళెవరూ గమనించటం లేదని నిర్ధారణ చేసుకున్నాడు.

టాయిలెట్ పక్కగా వున్న ద్వారంనుంచి అవతలి హాల్లోకి ప్రవేశించాడు. అక్కడ జనసంచారంలేదు. యెవరూ అటు యిటు నడుస్తున్న జాడకూడా లేదు.

ఒక్క క్షణం ఆగి చుట్టూ చూశాడు. కిరణ్ ఎటు వెళ్ళాడు? తను అతను లేచిన వెంటనే లేచి రావాల్సింది! ఆలస్యం చేయటంవల్ల కిరణ్ ఎటు పోయిందీ తెలీటం లేదు.

శ్రీనివాస్ అడుగులో అడుగు వేసుకుంటూ హాల్లో నడవసాగాడు. హాలుకి రెండువైపుల గదులున్నట్టున్నాయి. తలుపులు లోపల్నుంచి గడియపెట్టి వున్నాయి.

శ్రీనివాస్ చటుక్కున ఆగాడు. యెక్కడినుంచో అడుగుల సవ్వడి వినిపిస్తోంది. చెవులు రిక్కించి విన్నాడు. గోడ పక్కగా కి నీడలోనికి తప్పుకుని చూడసాగాడు.

* * *

కిరణ్ కళ్ళు భారంగా తెరిచాడు. అక్కడ వెలుగు చూడలేక మళ్ళీ కళ్ళు వాటంతటవే మూసుకుపోయాయి

కళ్ళు చికిలించుకుని చూశాడు. తల భారంగా వుంది. తల చిట్లి రక్తం అట్టకట్టినట్టు, ఆ ప్రదేశంలో తిమ్మిరిగా వున్నట్టు గమనించాడు.

చేత్తో గాయాన్ని తడుముకున్నాడు. చల్లగా తగిలింది రక్తం!

"హల్లో! మైడియర్ కిరణ్, హౌ ఆర్యూ?" అని వినిపించింది. కిరణ్ చటుక్కున అటు చూశాడు.

ఓ పక్కగా వున్న కుర్చీలో యెవరో వ్యక్తి కూచుని వున్నాడు. నోట్లో పైప్ వెలుగుతోంది. చేతులకి గ్లవ్స్ వేసుకుని వున్నాడు. కళ్ళకు రాత్రిపూట కూడా నల్ల కళ్ళద్దాలున్నాయి! నవ్వుతూ కిరణ్ వంక చూశాడు.

కిరణ్‌కి అతన్ని యెక్కడో చూసినట్టనిపించింది. యెంత ఆలోచించినా గుర్తు రావటంలేదు. కాని ఆ ముఖం తనకి బాగా గుర్తు! యెవరతను?

"ఐయామ్ సారీ, నిన్ను బాధపెట్టాల్సి వచ్చింది" అన్నాడతను హిందీలో.

ఆ గొంతు గుర్తుపట్టాడు. తనని ఫోన్‌లో సవాల్ చేసిన గొంతు. అవును, అతనే యితను! కాని ముఖం యెక్కడో చూసినట్టు అనిపిస్తోందిగాని, యిప్పటికీ జ్ఞాపకం రావటంలేదు.

"నేనెవరని ఆలోచిస్తున్నావు కదూ! నన్ను లయిన్ అంటారు. ఇంకో భాషలో చెప్పాలంటే ఎక్స్ జీరో టూ—ఏజెంట్ ఎక్స్ జీరో టూ!" అన్నాడతను నవ్వుతూ.

కిరణ్ మెదడులో స్పార్క్ వెలిగింది. అతనెవరో గుర్తొచ్చింది. శ్రీనివాస్ ఏజెంట్ ఎక్స్ జీరో టూ—దివాకర్—ఫోటో చూపించాడు. అంటే దివాకరే ఈ

ఘోరాలు చేస్తున్న లయినా?

"ఆశ్చర్యపోతున్నావు కదూ! లయిన్ పేరుతో స్మగ్లింగ్ చేస్తూన్న ది గ్రేట్ దివాకర్ నేనే! ఏజెంట్ ఎక్స్ జీరో టూ! నేనిక్కడికి స్మగ్లింగ్ ఇన్వెస్టిగేషన్ పేరుతో వచ్చాను. అప్పటికే దేశం నలుమూలలా నా ఏజెంట్సున్నారు. సీక్రెట్ ఏజెంటుని కాబట్టి నన్నెవరూ అనుమానించరు. అందుకే నేను చేస్తున్న ప్రొహిబిటెడ్ గూడ్సు స్మగ్లింగ్ యిన్వెస్టిగేషన్ చేయటానికి నేనే ఏజెంటుగా బయల్దేరాను.

"అలా ఆశ్చర్యపోకు మరి! దేశభక్తి మాతృభక్తి అంటూ నీతులు వల్లించటానికి బాగానే వుంటుందిగాని, నిజాయితీగా బతికినన్నాళ్ళు నేను బావుకున్నదేం లేదు. ఓ స్మగ్లింగ్ కేసు యిన్వెస్టిగేషన్ కోసం గతంలో ఓసారి బాంబే వచ్చాను. అప్పుడే ఈ స్మగ్లింగ్ మీద ఆసక్తి కలిగింది.

"స్నేక్ లెదర్, గంజాయి మొదలైన స్మగుల్డు ప్రొహిబిటెడ్ గూడ్స్‌కి విదేశాల్లో చాలా డిమాండు వుంది. అందుకే వాటిని స్మగుల్డు చెయ్యాలనుకున్నాను. అందుకు అనుకూల పరిస్థితులు చూసుకున్నాను. ఈ హోటల్ పక్కన ఖాళీస్థలంలో అమ్యూజ్‌మెంటు పార్కు పెట్టుకున్నాను. ఈలోపల స్నేక్ పార్కుని కూడా మెయిన్‌టెయిన్ చేస్తున్నాను. చూడటానికి స్నేక్ పార్కులా విజిటర్స్‌కి ఆనందం కలగజేస్తూ, ఆ పాముల చర్మాలతో భారీగా వ్యాపారం చేస్తున్నాను.

"సో, మిస్టర్ కిరణ్! ఇప్పుడు నేను కోటీశ్వరుణ్ని. లోకం దృష్టిలో దివాకర్‌గా చచ్చిపోయి మరో అవతారం ఎత్తాలనుకున్నాను. విదేశాలకుపోయి సుఖంగా

బతకాలనుకున్నాను. అందుకే ఓ శవాన్ని ఖండాలుగా చేసి అది నా శవంగా నిరూపించాలని ప్రయత్నించాను. ఆ ఖండాలని హైదరాబాదు క్రైంబ్రాంచ్ కి పంపాను. కాని దురదృష్టవశాత్తూ అది నాది కాదని నిర్ధారణ జరిగి పోయింది. కథ మళ్ళీ మొదటికి వచ్చింది.

"శత్రువులు చంపినట్లు నమ్మించాలని నేను ప్రేమించిన శకుంతలని కూడా పెట్రోలుపోసి తగలబెట్టించాను. అది నా అసిస్టెంటు చూసుకున్నాడు. అయితే అదీ ఫలించ లేదు. శకుంతలని రక్షించే ప్రయత్నంలో నా అసిస్టెంటు ఒళ్ళు కాల్చుకున్నాడుగాని శకుంతలని రక్షించలేక పోయాడు. నిజానికి శకుంతల ఆత్మహత్య చేసుకున్నట్టు ప్రజల్ని నమ్మించి, ఆమెని యిక్కడికి తీసుకురావాలనుకున్నాను. కాని నా అసిస్టెంటు అజాగ్రత్తవల్ల ఆమె ఆహుతి అయిపోయింది. నా అసిస్టెంటు తన అజాగ్రత్తకు ఫలితం నా చేతుల్లో అనుభవించాడు.

"శకుంతలని పోగొట్టుకున్న నా జీవితం వ్యర్థమనిపించింది. కాని, శకుంతలకోసం నా జీవితాన్ని మోడు చేసుకోలేను కదా! అందుకే నా ఫారిన్ ప్రయాణానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసుకున్నాను. ఈ లోపల అనవసరంగా యిన్వెస్టిగేషన్ బయల్దేరి నీ ప్రాణంమీదికి తెచ్చుకున్నావు.

"అదిగో నీ వెనకనే నీ ఫ్రెండు శ్రీనివాస్ కూడా లోపలికి వచ్చి నా ఆతిథ్యం స్వీకరించటానికి ఉబలాట పడుతున్నాడు. హల్లో, కమాన్ మైడియర్ జమిందార్ ఇన్స్పెక్టర్!" అన్నాడు దివాకర్ నవ్వుతూ గుమ్మం వైపు చూసి.

కిరణ్ తలతిప్పి చూశాడు. గుమ్మంలో శ్రీనివాస్ని

పెడరెక్కలు విరిచి లోపలికి తీసుకొస్తున్నారు యిద్దరు మనుషులు. అతని కళ్ళకు నల్లటి గంతలు కట్టారు. శ్రీనివాస్ గింజుకుంటున్నాడు. కాని వాళ్ళు పట్టు వదలటంలేదు.

శ్రీనివాస్, దివాకర్ వంక చూసి ఆశ్చర్యంలో నోరు తెరిచాడు. "మిస్టర్ ఎక్స్ జీరో టూ, మీరా?" అన్నాడు.

"ఎస్! మైడియర్ ఇన్‌స్పెక్టర్. నేనే అయామ్ దివాకర్!" అన్నాడు దివాకర్ నవ్వుతూ.

"మరి యిదేమిటి? నన్నిలా బంధించి తీసుకవస్తున్న ఈ మనుషులెవరు?"

"వాళ్ళు మనవాళ్ళేలే! నన్ను పట్టుకోవాలని మీరిద్దరు వస్తే మీ యిద్దర్నీ మావాళ్ళు పట్టుకున్నారు. ఒకే డిపార్టుమెంటు వాళ్ళంకదా! ఒకరినొకరు పరస్పరం గౌరవించుకోవటం ధర్మం కదా!" దివాకర్ నవ్వులో విషం తొంగిచూస్తోంది.

కిరణ్ దివాకర్ వైపు సూటిగా చూసి, "మిస్టర్ దివాకర్! నువ్వు చేస్తున్న ద్రోహం నీ దేశానికే కాదు, నీ ఆత్మకు కూడా! ఆత్మ ద్రోహం మంచిదికాదు. నీ అంతరాత్మే నిన్ను నిలదీసే గడియవస్తుంది. అప్పుడు నువ్వేం సమాధానం చెప్పుకుంటావో చెప్పుకో!" అన్నాడు.

దివాకర్ పగలబడి నవ్వాడు — "ఈ పనికిమాలిన సెంటిమెంట్సు నా దగ్గర పనికిరావు. ఆత్మ, ద్రోహం ఈ మాటలకు నా డిక్షనరీలో అర్థాలు లేవు. సో, లివ్ దెమ్ టు డాగ్స్!" అన్నాడు.

కిరణ్ లాల్చీ జేబులోకి చేయి పోనివ్వబోయాడు.

దివాకర్ ఫెళ్ళున నవ్వి, "వృథా ప్రయాస! నీ

రివాల్వర్ యెప్పుడో మా స్వాధీనమయింది. మిస్టర్ కిరణ్! నువ్విలాంటి పనేదో చేస్తావని మాకు ముందే తెలుసు. శ్రీనివాస్ జేబులో కూడా పిస్తోలుతీసి, మా వాళ్ళు తీసేసి పెట్టుకున్నారు" అన్నాడు.

కిరణ్ కి ఏదో అనుమానం వచ్చింది. నోరు తెరిచి అడగ బోయి అంతలోనే ఆ ప్రయత్నం విరమించుకున్నాడు.

శ్రీనివాస్ కి యెక్కడో మెలిక వున్నట్టనిపిస్తోంది. కాని లింక్ అందటంలేదు.

"తెల్లవారేవరకు మా అతిధులుగా వుండండి. తెల్ల వారేసరికి మేము యెక్కిన ఫ్లైట్ గల్ఫ్ కంట్రీస్ లో ల్యాండవుతుంది. తెల్లవారేసరికి మీ యిద్దరి ప్రాణాలు పరలోకంలో, మరో జన్మ ఎత్తటానికి మీ ఆత్మలు మరో రెండు శరీరాలకోసం వెతుక్కుంటూ వుంటాయి" అంటూ పడిపడి నవ్వాడు దివాకర్.

ఆ నవ్వు, ఆ మాటతీరు—అంతా అగమ్యంగా అనిపి స్తోంది శ్రీనివాస్ కి. కిరణ్ తన అనుమానం బయట పెట్టబోయి, అది సమయంకాదని విరమించుకున్నాడు.

"వీళ్ళిద్దర్నీ అండర్ గ్రౌండ్ లో వేసెయ్యండి. నేను మళ్ళీ చెబుతాను — అప్పుడు మొసళ్ళకు ఆహారంగా వేసేద్దురుగాని!" అన్నాడు దివాకర్ తన అనుచరులతో.

కిరణ్ శ్రీనివాస్ లను చేతులు వెనక్కి విరిచి కట్టేసి మళ్ళీ గంతలు కట్టారు కళ్ళకు.

9

ఏకాంతం లభించగానే తన మనసులోనిమాట అడిగే కాడు కిరణ్ శ్రీనివాస్ ని.

"ఎంతసేపూ దివాకర్ హిందీలోనే మాట్లాడాడు.

తెలుగు రాదా?" అని.

శ్రీనివాస్‌కి లింక్ అందింది.

"బ్రదర్, అసలు విషయం తెలిసిపోయింది.

"ఏమిటి?"

"మనం చూసిన దివాకర్ అసలు దివాకర్ కాదు. ఏజెంట్ ఎక్స్ జీరో టూ కాదు."

"అదే నా అనుమానం కూడా. ఎంతసేపూ అతను హిందీలో మాట్లాడుతున్నాడు. తెలుగువాడు కాదేమోనని అనుమానం వచ్చింది. అడగబోయి రెండుసార్లు విరమించుకున్నాను."

"నాకు ఆ కంఠం విన్నప్పుడే అతను దివాకర్ కాదని తట్టవలసింది. కాని అతను అచ్చం దివాకర్‌లాగానే వుండటంతో ఆ అనుమానం బయటికి రాలేదు. ఆ నవ్వూ, కంఠం అన్నీ దివాకర్ కాదని ఓ పక్క చెప్తూనే వున్నాయి. దివాకర్‌ది సన్నటి గొంతు. హిందీ సరిగ్గా రాదుగాని, నేర్చుకుంటున్నాడు."

"సో, మనల్ని రాంగ్ ట్రాక్ పట్టించటానికి శత్రువు భలే నాటకం ఆడాడు. దానివల్ల అతనికొచ్చిన లాభమేమిటో అర్ధంకాదు. అసలు దివాకర్ ఏమయినట్టు? బతికున్నాడా, చంపేశారా? ఈ విషయాలు కన్ఫర్మ్ కావలసి వుంది."

"తను సంపాదించినదంతా తీసుకుని ఈ గ్రేట్ స్మగ్లర్ గల్ఫ్ కంట్రీస్‌కిపోయే మాటమాత్రం నిజం! బెదిరిస్తున్నాడేగాని, మనల్ని చంపకపోవచ్చు"

"యూ ఆర్ రైట్! ప్రభుత్వం దృష్టిలోను, ప్రజల దృష్టిలోను దివాకర్ 'విలన్' అని యిమేజ్ సృష్టించటానికి మనల్ని వాడుకుంటాడు. ఈ విషయం బయట

లోకానికి చెప్పటానికి మనం బతికే వుండాలి కదా! అంచేత మనకి ఎలాంటి హాని చెయ్యడు. తను తప్పించుకు పోయేంతవరకు మనకీ బందిఖానా తప్పదు. బహుశా వాడు వెళ్ళిపోయేముందు మనకి స్పృహతప్పించి ఎక్కడో రోడ్డున వదిలేస్తాడు" అన్నాడు కిరణ్.

శ్రీనివాస్ ఏదో చెప్పబోయేంతలో చేత్తో వారించాడు కిరణ్. యెక్కడో సన్నటి మూలుగు శబ్దం వినిపిస్తోంది. ఎవరిది?

శ్రీనివాస్ చెవులు రిక్కించి విన్నాడు. కిరణ్ వంక సాభిప్రాయంగా చూశాడు.

కిరణ్ చుట్టూ చూశాడు. గాలి వెలుతురులేని యిరుకు గది అది. ఓకే ఒక ద్వారం వుంది. సన్నటి ద్వారం. దానికి యినప తలుపు. బయట తాళం పెట్టేశారు. తప్పించుకోవటమనేది చాలా కష్టం!

కిరణ్ యినప తలుపుకున్న చువ్వల్లోనించి బయటికి చూశాడు. యమకింకరుల్లాంటి పోతపోసిన విగ్రహాల్లా వున్న వ్యక్తులిద్దరు బయట విస్కీమత్తులో జోగుతున్నారు. వాళ్ళ చేతుల్లో ద్రవంతో వున్న సీసా లున్నాయి.

కిరణ్ తలుపుమీద చప్పుడు చేశాడు. అందులో ఒకడు ఇటు చూసి "క్యాహోనా బే?" అన్నాడు నిర్లక్ష్యంగా.

కిరణ్ వేలు చూపించాడు.

వాడు దగ్గరగా వచ్చాడు. తాళంతీశాడు. కిరణ్ ఏమాత్రం ఆలస్యం చెయ్యకుండా వాడ్ని లోపలకులాగి వాడి మెడకు వెనకనుంచి చేతులు పెనవేసి తలముందుకి బలంగా వంచాడు.

వాడి మెడనరాలు పటపటమన్నాయి. వాడి మాడు

మీద రెండు చేతులు బిగించి ఒక్క దెబ్బ వేశాడు కిరణ్.

అంత పెద్ద పహిల్వానులాంటి మనిషీ నేల కరిచాడు.

ఈలోపల రెండోవాడు చకచక వచ్చాడు తూలుతుంటూ. ఉత్తరక్షణంలో పూని వాడి పొట్టలోను ముఖం మీద పిడికిళ్ళు బిగించి కొట్టాడు కిరణ్. శ్రీనివాస్ వాళ్ళిద్దర్నీ, కిరణ్‌ని మార్చి మార్చి చూశాడు.

రెండోవాడు కూడా నేలకూలిపోయాడు. శ్రీనివాస్ కిరణ్ హస్త నైపుణ్యం ఆశ్చర్యంగా చూస్తున్నాడు. తనకి పోలీస్ ట్రయినింగ్ లో కూడా ఇలాంటి సులువైన ఫైట్సు నేర్పలేదు. కిరణ్‌కి ఎలా పట్టుబడ్డాయి?

"పద, శ్రీనివాస్! ఆలోచనల కిది సమయంకాదు. ఇక్కడే యెక్కడో దివాకర్‌ని బంధించి వుంటారు. మనం అతన్ని రక్షించాలి! ఈ రాత్రికి రాత్రే యీ లయన్ గాడి అంతు తేల్చెయ్యాలి! చరమగీతం పాడటానికి ఈ రాత్రే ముహూర్తం" అన్నాడు కిరణ్ ముందుకి ఉరుకుతూ.

అది నేల మాళిగ. పైకి మెట్లున్నాయి. కిరణ్ యిందాకా మూలుగు శబ్దం వినిపించినవైపు చకచక అడుగులు వేశాడు. చుట్టుపక్కలంతా నిశ్శబ్దం రాజ్యమేలుతోంది.

కిరణ్ తమని బంధించిన గదిలాంటిదే మరొకటి అక్కడ వుండటం గమనించి, లోపలికి తొంగిచూశాడు. మూలుగు శబ్దం అక్కడినించే వస్తోంది.

కిరణ్ ఆనందంతో సన్నగా అరిచాడు లోపలి మనిషిని చూసి.

అతను దివాకర్! సీక్రెట్ ఏజెంట్ ఎక్స్ జీరో టూ!

10

అతని కాలివేళ్ళు ముక్కలుగా కోసేశారు. చెవులకి చిల్లులు పెట్టారు. ముక్కు సగంకోసి, మాంస ఖండరం వేలాడేలా అలాగే వదిలేశారు. చేతివేళ్ళు కణుపుల వరకు నరికేశారు.

ఆ దృశ్యం యెంతోసేపు అలా చూడలేకపోయాడు కిరణ్. శ్రీనివాస్ దివాకర్ వంక దీనంగా చూస్తూండి పోయాడు.

కిరణ్ రెండు అంగల్లో తమని బంధించిన చీకటిగది దగ్గరకొచ్చి, తలుపుకున్న తాళాలగుత్తి తీసుకొచ్చాడు. అందులో దివాకర్‌ని బంధించిన గదితాళముంది. రెండు క్షణాల్లో తెరిచి లోనికివెళ్ళారిద్దరు.

దివాకర్ బాధతో మూలుగుతున్నాడు. గాయాల మీద కారం చల్లినట్టున్నారు. ఆ బాధను అతను తట్టుకోలేక మూలుగుతున్నాడు. చిత్రహింసపెట్టి అతన్నుంచి ఏదో సమాచారం రాబట్టాలని లయన్ ముఠా ప్రయత్నించినట్టు అర్థంచేసుకున్నారు వాళ్ళు.

"మిష్టర్ దివాకర్....ఏజెంట్ ఎక్స్ జీరో టూ..." అంటూ పిలిచాడు కిరణ్ అతని చెవిలో.

దివాకర్ భారంగా కళ్ళెత్తి చూశాడు.

"అయామ్ డిటెక్టివ్ కిరణ్. ఈయన ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్!" అన్నాడు కిరణ్ అతని చెవిలో.

దివాకర్ కళ్ళు మెరిశాయి.

"మా అజాగ్రత్త కారణంగా మీరు వీళ్ళకు దొరికి పోయారు. వీళ్ళ వెంటనే మేమూ హోటల్ తాజ్‌కి వచ్చాం. కాని అప్పటికే మిమ్మల్ని కిడ్నాప్ చేసి తీసుకొచ్చేశారు లయన్ ముఠా!" అన్నాడు కిరణ్.

దివాకర్ తలూపాడు.

"మీ వేషంలో లయిన్ మాకు దర్శనమిచ్చాడు. మీరే ఈ దురాగతాలన్నిటికీ కారణమని మమ్మల్ని నమ్మించాడు. కాని వాడ్ని మేము కనిపెట్టేశాం. చూడబోతే వీళ్ళు మిమ్మల్ని చిత్రహింసలపాలు చేసినట్లు కనిపిస్తోంది. ఎందుకు చేశారిలాగ? మీరు వాళ్ళ రహస్యాలు కనుక్కోవటానికి వచ్చారనా? మాకు వీళ్ళ గురించి యిన్ఫర్మేషన్ యిచ్చారనా? యెందుకు?" అడిగాడు శ్రీనివాస్.

దివాకర్ జాలిగా చూశాడు. బాధగా మూలిగాడు.

నాలిక చాపి చూపించాడు.

చూస్తూన్న యిద్దరికీ గుండెలు ద్రవించాయి. గుండెల్ని పిండినట్టనిపించింది.

దివాకర్ నాలుక సగం తెగ్గొట్టేశారు.

ఎంత దారుణం! యెన్నోరకాల చిత్రహింసలు చూసిన శ్రీనివాస్‌కి దివాకర్‌కి వాటిల్లిన దురవస్థ చూసి కంట నీరు తిరిగింది.

కిరణ్ శ్రీనివాస్‌ని తొందర చేశాడు. "మనకున్న సమయం చాలా తక్కువ. అమూల్యమైనది కూడా. ఈ రాత్రే లయిన్ తనవాళ్ళతో ఫోన్ పోవటానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నాడు. చేజారిపోతే మళ్ళీ మనకు చిక్కడు. ఇక ఎన్నటికీ మనకు దొరక్కుండా తప్పించుకుపోతాడు. దివాకర్ గారు యిప్పుడే మీ చెప్పలేరు. ఏదయినా చెప్పాలనుకున్నా రాసిచూపించగలరు. మన ప్రస్తుత కర్తవ్యం ఈయన్ని బయటికి సురక్షితంగా చేర్చటం! రెండోది లయిన్ ముఠాని పూర్తి సాక్ష్యాధారాలతో బంధించి, అతని దారులన్నీ కట్టెయ్యటం!

హారియప్! ముందిక్కడినుంచి బయటపడటం చాలా ముఖ్యం!" అన్నాడు.

"ఎలా? నాకు దారి తెలీదే! మనిద్దరికీ గంతలు కట్టి తీసుకొచ్చారు కదా!" అన్నాడు శ్రీనివాస్.

డిటెక్టివ్ కిరణ్ వాచీ చేతినుంచి తీసి, వెనకపక్క కప్పు ఊడదీశాడు. లోపల చిన్నసైజు ట్రాన్స్‌మిటర్ వుంది. దాంట్లో వైర్‌లెస్ మెసేజ్ పంపే సౌకర్య ముంది. వెంటనే పెట్రోలింగ్ వాన్‌కి సంకేతాలు పంపించాడు.

బొంబే పెట్రోలింగ్ వాన్‌కి కనెక్షన్స్ మొద లయ్యాయి. క్షణాలమీద హోటల్ లోటస్ వెనుక పక్కనున్న అమ్యూజ్‌మెంట్ పార్కు విషయం మెసేజ్ వెళ్ళిపోయింది మొబైల్ పెట్రోలింగ్ వాన్‌కి. తగిన సిబ్బందితో వెంటనే పార్కుని, హోటల్ని ముట్టడించ బోతున్నట్టు జవాబు వచ్చింది.

"మనం యిక్కడికొచ్చేముందు జుహూ బీచ్‌పక్క నున్న మొబైల్ స్క్వాడ్‌కి యిన్ఫర్మేషన్ యిచ్చాను. ఈ ట్రాన్స్‌మిటర్లో వాళ్ళ వైర్‌లెస్ సెట్‌కి అను గుణంగా చిన్న మార్పులు చేశాను. అవసరమైతే మనల్ని ఫాలో కావలసిందిగా ఆదేశాలు యిదివరకే జారీ చేయ బడ్డాయి కదా! ఇప్పుడు వాళ్ళ పని పడింది" అన్నాడు కిరణ్.

శ్రీనివాస్ ప్రశంసగా ఏదో అనబోతుండగానే కిరణ్ వారించి, "ముందు జరగాల్సిన పని చూడు. ఎవరి కళ్ళబడకుండా దివాకర్‌గార్ని బయిటికి చేర్చగలగటం సామాన్యమైన విషయంకాదు. నేను ముందు బయటికి పోయేదారి చూస్తాను. నువ్వు ఈయన్ని బయటికి చేర్చు"

అన్నాడు లేచి నిలబడుతూ.

దివాకర్ చటుక్కున కిరణ్ చెయ్యి పట్టి ఆపాడు. ఏదో రాయాలని సైగ చేశాడు. కిరణ్ లాల్చీ లోపలి జేబునుండి కాగితం తీశాడు. అది దివాకర్ రాసిచ్చిన ప్లాన్ కాగితం! ఎందుకో దాన్ని లయిన్ మనుషులు తీసుకోలేదు. ఏదో పిచ్చిబొమ్మలా కనిపించి వుంటుంది వాళ్ళ కళ్ళకి!

శ్రీ ని వా స్ పైజమాకి తగిలించుకున్న పెన్ తీసి అందించాడు.

దివాకర్ దానిమీద రెండేమాటలు రాశాడు అచ్చ తెలుగులో. "శకుంతల కులాసానా?" అని.

అది చదివిన డిటెక్టివ్‌ల మనసు కరిగిపోయింది.

కిరణ్ నెమ్మదిగా అన్నాడు. "ఆమెని లయిన్ మనుషులు హత్య చేశారు. పెట్రోల్ పోసి తగలబెట్టారు."

దివాకర్ చిగురాకులా ఒణికిపోయాడు.

"అయామ్ సారీ మిష్టర్ దివాకర్, సో సారీ!" అన్నాడు కిరణ్ అతని భుజం తట్టి.

దివాకర్ కళ్ళు సంతతధారగా స్రవిస్తున్నాయి.

కిరణ్ చకచక మెట్లవైపు నడిచాడు. అక్కడ కాపలా మనుషులెవరైనా వున్నారేమో చూశాడు. యెవరూ లేకపోవటంతో చకచక మెట్లెక్కాడు. చప్పుడుకాకుండా నడవాలోకి నడిచాడు. అక్కడంతా చీకటిగా వుంది.

తడుముకుంటూ నడుస్తూ కాలికి గట్టిగా ఏదో తగలటంతో చటుక్కున ఆగాడు. అది చెక్కపెట్టె. కేష్ పెట్టె. పైమూత ఊడిపోయింది కిరణ్ తాకిడికి.

కిరణ్ చెయ్యిపెట్టి తడిమి ఒళ్ళు గగుర్పాటు చెందగా

చటుక్కున చెయ్యి తీసేశాడు.

పాము చర్మాలు! ఆ స్పర్శకి అతని వెన్నున జరజర ఏదో పాకినట్టయింది. ఇలాంటి పెట్టెల్లో ప్యాక్ చేసి పైన మరేదో పెట్టి, ఓడల్లో ఎక్స్‌పోర్ట్ చేస్తూండి వుండవచ్చు.

కిరణ్ ఆలస్యం చెయ్యలేదు. వరండాలోనించి సన్నగా వెలుగు పడుతోంది. ఆ పక్కగా పిల్లిలా నడిచాడు. వెలుగు లోపలి హాల్లోంచి పడుతోంది. ఆ హాలు గుర్తుపట్టాడు. తను, శ్రీనివాస్‌లు తీసుకురాబడ్డ లయిన్‌ని దివాకర్‌గా పరిచయం చేసుకున్న హాలు అది! అక్కడినుంచి బహుశా అమ్యూజ్‌మెంటు. పార్కు ముందరి హాలుకి కనెక్షన్ ఉండివుండాలి!

కిరణ్ ఊహ నిజమయింది. అక్కడ్నించి తనకు తల మీద మోది స్పృహతప్పించిన హాల్లోకి సరాసరి దారి వుంది. ఇక ముందుకి పోవలసిన పనిలేదు. ఆ తర్వాత జూదాలు, కాబరే డాన్సులు, అవన్నీ తనకి తెలిసిన వారే!

కిరణ్ వెనుతిరిగాడు. ముందరి హాల్లోంచి మెట్లవైపు నడవాకి చేరుకున్నాడు. కాని అతనికేదో అనుమానం తడుతోంది మనసుకి. వాతావరణంలో ఏదో తేడా వచ్చినట్టు స్పష్టంగా తెలుస్తోంది. అందుకు కారణం— అంతవరకు చీకటి కోణంగా వున్న లయిన్ స్థావరమంతా దేదీప్యమానంగా వెలుగుతోంది.

మెట్లు దిగబోతూ ఆగిపోయాడు కిరణ్.

పై మెట్టుమీదనే ఓ మనిషి చేతిలో గన్ పట్టుకుని నించున్నాడు. మెట్ల దిగువ నేలమాళిగ కూడా వెలుగు కాంతుల్లో పట్టపగలులా వుంది.

మధ్యగా దివాకర్, శ్రీనివాస్‌లు యిద్దరు పెడ

రెక్కలు విరిచికట్టబడి నిలబడి వున్నారు. వాళ్ళిద్దరికీ గురిచూసి చుట్టూ వలయాకారంగా లయిన్ మనుషులు గన్స్‌తో సిద్ధంగా వున్నారు. వాళ్ళ చేతుల్లోని గన్స్ ఏ క్షణంలోనైనా దివాకర్ని, శ్రీనివాస్‌ని కాల్చేయటానికి సిద్ధంగా వున్నాయి.

ఓ పక్కగా అంతదాకా దివాకర్‌లాగా నటించిన లయిన్ తన సహజరూపంతో నించుని వున్నాడు. అతని చేతిలో రివాల్వర్ వుంది. అది కూడా వాళ్ళిద్దరికీ గురి పెట్టి వుంది.

లయిన్ నల్లగా వున్నాడు. మిడిగుడ్లు ఎర్రగా రక్తం చిందిస్తున్నాయి. అతని ఛాతీమీద తెల్లటి బనీను, ఆ బనీనుమీద సింహాంతల ముద్ర వేసి వుంది!

“దివాకర్, నిన్ను యెందుకు బతికించి వుంచానో తెలుసా! నా రహస్యాలు పేపరుమీద రాసి ఎక్కడో దాచివుంచా నన్నావు. అది యింకా బయటివాళ్ళెవరికీ పోలేదని నాకు తెలుసు. అందుకే నీ హోటల్ రూం అంతా వెతికించాను. కాని అదెక్కడా కనిపించలేదు. దాన్ని నాకు అందచేసేవరకు నీకు కూడు లేకుండా మాడ్చి చిత్రహింసపెట్టాను. అయినా నువ్వు మొండివాడివి. అది అందచేయలేదు. కాని యిప్పుడు యీ డిటెక్టివ్‌లతో చేతులుకలిపి తప్పించుకు పోవాలనుకున్నావు. ఇక నిన్ను క్షమించేదిలేదు. నా చేతుల్తోనే నిన్ను ఈ లోకంనించి పంపెయ్యదలచుకున్నాను. దేవుణ్ణి ప్రార్థించుకో!” అంటూ సేఫ్టీ కాచ్ తప్పించి ట్రిగ్గర్ మీద వేలుంచాడు లయిన్.

కిరణ్ స్ప్లిట్ సెకండ్‌లో పై మెట్టుమీదున్న కాపలావాడి చేతిలో గన్ లాక్కుని, వాణ్ణి మెట్ల

మీదినుంచి కిందికి తోసేశాడు. మరుక్షణంలో దివాకర్ కి రివాల్వర్ గురిపెట్టిన లయిన్ చెయ్యి రక్తంతో ధారలు కట్టింది. రివాల్వర్ కిందపడిపోయింది. కిరణ్ చేతిలోని గన్ ఒకసారి గర్జించింది.

కిరణ్ మెట్లుకిందికి దూకాడు. సరాసరి లయన్ ముందుకొచ్చి అతని గుండెలకు తుపాకీ గురిచేశాడు.

"మిస్టర్ లయిన్! నీవాళ్ళనందర్నీ గన్స్ కిందపడెయ్యమని ఆదేశించు—లేకుంటే నిర్దాక్షిణ్యంగా కాల్చేస్తాను" అన్నాడు కిరణ్.

లయిన్ ఉక్రోషంతోను కోపంతోను సింహనాదం చేశాడు. తనవాళ్ళకంక సైగచేశాడు. చేతులు రెండూ పైకె త్తేశాడు.

అయితే ఇంతలో వూహించనివిధంగా ఓ మూలనుండి ఓ అనుచరుడు దొంగదెబ్బతీశాడు. కిరణ్ కి గురిచూసి కాల్చాడు. అయితే అమాంతం దివాకర్ కిరణ్ కి అడ్డొచ్చేశాడు. గుండు దివాకర్ భుజంలోనుంచి దూసుకుపోయింది.

కిరణ్ కళ్ళు కృతజ్ఞతతో మెరిశాయి. రెండో బుల్లెట్ తన గన్ నించి బయటికి రాకముందే ఆ అనుచరుడి గుండెల్లోంచి కిరణ్ గన్ లోని గుండు దూసుకుపోయింది.

సరిగ్గా అదే సమయంలో మొబైల్ పెట్రోలింగ్ వాన్ స్టాఫ్ తోబాటు ఒక్కసారిగా వందల సంఖ్యలో పోలీసులు ఆ నేలమాళిగనిండా నిండిపోయారు.

ఎక్కడివాళ్ళనక్కడే అదుపులోకి తీసుకున్నారు.

లయిన్ రహస్యంగా దాచిన ప్యాకేజీ పెట్టెలన్నీ స్నేక్ లెదర్స్ తోబాటు దొరికిపోయాయి. మరో పక్క

గంజాయికూడా పట్టుబడిపోయింది.

దివాకర్ నోటినుంచి రక్తం కారుతోంది. భుజంనించి రక్తం కారుతోంది. అతని కాలివేళ్ళనుంచి, చేతివేళ్ళ నుంచి రక్తం కారుతోంది. కాని అతని కళ్ళుమాత్రం తేజోవంతంగా వెలిగిపోతున్నాయి. మాతృదేశం మీద భక్తితో పవిత్రతను సంతరించుకున్నాయి.

కిరణ్ కి సైగ చేశాడు. అదే కాగితంమీద పెన్ తో స్కెచ్ గీశాడు. అది హోటల్ తాజ్ రూంలోని వస్తువుల్ని సూచించే స్కెచ్, రాక్ లోని ఓ పుస్తకం పేరు రాశాడు. దాని రేపర్ వెనుక లయిన్ ఏజెంట్ల లిస్టు, వాళ్ళ వివరాలు అడ్రసులతో బాటు పదిలపరిచిన విషయం ఆ కాగితంమీద రాశాడు.

కిరణ్ అతన్ని అక్కున చేర్చుకున్నాడు. దివాకర్ లాంటి దేశభక్తుడ్ని, కార్యదీక్షాపరుడ్ని కన్న భారత మాత జన్మ ధన్యమయిందనుకున్నాడు.

దివాకర్ కళ్ళు కిరణ్ వంక నిశ్చలంగా చూస్తున్నాయి. అవి యింకా తేజస్సును వెదజల్లుతునే వున్నాయి. పవిత్రతను, కార్యదీక్షను ప్రతిఫలిస్తునే వున్నాయి.

—:ఐ పో యి ం ది:—